



అక్రమంగా కట్టేయ్! అడిగేదెవరు!



ఇలా వదిలేశారే : నిడదవోలు మునిసిపాలిటీలో మెయిన్‌రోడ్డుపై సెల్లార్ లేకుండా నిర్మించిన భవనం

జిల్లాలో యథేచ్ఛగా అక్రమ భవన నిర్మాణాలు

రాజమహేంద్రవరం సిటీ/నిడదవోలు/కొవ్వూరు జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :డబ్బులివ్వండి.. భవనాలు ఇష్టానుసారం కట్టుకోండి అనేలా ఉంది టౌన్ ప్లానింగ్ అధికారులతీరు.. మామూళ్ల మత్తులో జోగుతా అక్రమ నిర్మాణాలను వదిలేస్తున్నారు. వ్యాపార భవన సముదాయమైనా.. గృహ నిర్మాణమైనా అనుమ తుల్లేకపోయినా నిర్మించుకోవచ్చు.ఇలా జరగాలంటే అధికారులకు మామూళ్లు అందిస్తే చాలు. అక్రమ భవన నిర్మాణాల వంక కన్నెత్తి చూసే అధికారులు ఉండరు.ఇలాంటి నిర్మాణాల మీద ఫిర్యాదులు వస్తే మాత్రం సంబంధిత అధికా రులు తమ ఉద్యోగ భద్రత కోసం ఆ భవన నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చి సరిపెట్టేస్తారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అక్రమ,నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవన నిర్మాణాలపై కోర్టుకు వెళ్లరు ఇదంతా మామూళ్ల మహిమ.దీంతో జిల్లాలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.

క్రమబద్ధీకరిస్తారనే ఆశలో..

కూటమి ప్రభుత్వ ఖచ్చితంగా అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరిస్తుందనే ధీమాలో యజమానులు ఉన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.700 కోట్లు ఆదాయం వచ్చేలా చేసింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా రెగ్యులర్ చేస్తుందనే నమ్మకంలో అక్రమ నిర్మాణదారులు ఉన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మునిసిపల్ మంత్రి నారాయణ కూడా ప్లాన్లకు మించి అదనపు శ్లాబ్ నిర్మాణాలు చేసిన వాటిని నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.దీంతో నిర్మాణదారులకు భయం పోయింది.కొంత మంది అక్రమార్కులు దీనిని వెసులుబాటుగా చేసుకునేందుకు రేయింబవళ్ళు నిర్మాణాలు చేస్తున్నట్టు తెలిసింది.ఏడాది కిందట నిర్మించుకున్నవాటిని పునఃపరిశీలన చేశాక మాత్రమే క్రమబద్ధీకరిస్తారు. భవనాల క్రమబద్ధీకరణ జరిగితే ఒక్క రాజమహేంద్రవరం నుంచే సుమారు రూ.20 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉంది. అయితే రూల్స్‌ను మరింతగా బ్రేక్ చేసి చీట్ చేసిన వాటిని మాత్రం క్రమబద్ధీకరించే అవకాశాలు లేవు.

- డబ్బులిచ్చుకో..కట్టుకో
- పట్టణాల్లో వందల భవనాలు
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తే కారణం
- నాయకులతో సిఫారసులు
- కూటమి వచ్చినా ఆగని వైనం
- జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు
- క్రమబద్ధీకరణపై ఆశలు



రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో అక్రమ భవన నిర్మాణం

రాజమహేంద్రవరంలో 100కి పైగా

జిల్లా అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది..అనుమతులు లేకుండా భారీ భవంతులు కట్టేస్తున్నారు.గత ఐదేళ్లగా పరిస్థితి మితిమీరింది. ప్రస్తుతానికి అదే కొనసాగుతోంది.అయినా అడిగే నాథుడే కనిపించడం లేదు. రాజమహేంద్రవరం లో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మించారు.గతంలో సుమారు 100 భవనాలకు అధికారులు నోటీసులిచ్చినట్టు తెలిసింది.వాటి సంగతి తేలకముందే మరొక 50 పైబడి భవనాలు పుట్టుకొచ్చాయి. గత ప్రభుత్వం చివర రోజుల్లో వైసీపీ నాయకుడొకరు అప్పటి సీఎం అండతో భారీగా వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. అక్రమ భవనాల మాటున అధికారులకు లక్షలాది రూపాయలు అందాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రాజమహేంద్రవరంలో నిబంధనలు అతిక్రమించి సుమారు 100కి పైబడి ఉన్నట్టు సమాచారం. 400 చదరపు అడుగులకు అనుమతి తీసుకుంటే శ్లాబ్‌లు 600 చదరపు అడుగులు నిర్మించారు. రెండు ఫ్లోర్లకు అనుమతులు తీసుకుని నాలుగు ఫ్లోర్లు నిర్మాణాలు చేశారు. 90 శాతం గత ప్రభుత్వ హయాంలో జరగ్గా...ఈ ఆరునెలలో 10 శాతం నిర్మాణాలు జరిగాయి.రాజమహేంద్రవరంలో అక్రమ భవన నిర్మాణాల సమస్య రాష్ట్ర విజిలెన్స్ డీజీ దృష్టికి వెళ్లినట్టు తెలిసింది.నగరానికి చెందిన ఒక వ్యక్తి విజిలెన్స్ డీజీకి ఫిర్యాదు చేయడంతో సమస్యపై ఆరా తీసింది.దీనిపై యాక్షన్‌లోకి వెళ్లే అవకాశం ఉంది.

నిడదవోలులో ఇలా..

నిడదవోలు పురపాలక సంఘం గత ఐదేళ్ల అక్రమ భవన నిర్మాణాలకు అడ్డాగా మారిపోయింది.గత వైసీపీ పాలన నుంచి నేటి వరకు నిబంధనల ఊసేలేదు. ఒక పక్క అధికారులకు మామూళ్లు..మరోపక్క సిఫార్సులతో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సాక్షాత్తు పట్టణ పరిధిలోని సచివాలయానికి ఎదురుగా నిర్మించిన నివాస గృహాల సముదాయంలో అనుమతులకు విరుద్ధంగా కమర్షియల్ షాపులు నిర్మించినా అధికార్లు అటువైపు కన్నెత్త యినా చూడలేదు. పట్టణ పరిధిలో గత ఐదు స్నరేళ్లలో సుమారు వందకు పైగా అక్రమ భవన నిర్మాణాలు ఉన్నాయి. పట్టణంలోని గణ పతి సెంటరుకు అతిసమీపంలో గతేడాది నిర్మించిన వాణిజ్య భవన నిర్మాణంలో నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాన్ని వదలకుండా నిర్మించేశారు.ప్రధాన రహదారిపై ఈ భవన నిర్మాణం కనిపిస్తున్నా అధికారుల్లో చలనం లేదు.కారణం అధికారులకు భారీగానే తాయిలాలు అందినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇలాంటి భవన నిర్మాణాలు పట్టణంలో ఎన్నో ఉన్నాయి.నిడదవోలు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.సుప్రియను ప్రశ్నించగా 2024 సంవత్సరానికి అక్రమ,నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు 23 గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు.

కొవ్వూరులోనూ ఇంతే..

కొవ్వూరు పట్టణంలోనూ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. సుమారు 30 నుంచి 50 వరకూ అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు అధికారులు నోటీసులు జారీ చేసినట్టు చెబుతున్నారు. మిగలిన భవనాలు పరిశీలిస్తామన్నారు.



రాజమహేంద్రవరంలో పోలీస్ పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న డీజీపీ ద్వారకాతిరుమలరావు, చిత్రంలో ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ నరసింహకిశోర్..ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కను నాటుతున్న డీజీపీ

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

పోలీస్ పెట్రోల్ బంక్ ప్రారంభంలో డీజీపీ ద్వారకాతిరుమలరావు

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు అన్నారు. రాజమహేంద్రవరం పోలీస్ క్వార్టర్స్ శ్రీరాంపురం రహదారిలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఐవోసీఎల్ ఏర్పాటు చేసిన పోలీస్ పెట్రోల్ బంక్‌ను సోమవారం ప్రారంభించారు.ఇప్పటికే ఒక పెట్రోల్ బంకును నిర్వహిస్తున్న పోలీస్ శాఖ రాజమహేంద్రవరంలోనే రెండో బంక్ ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ద్వారకాతిరుమలరావుకు తొలుత ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ. అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహకిశోర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ప్రారంభించారు.ఆర్టీసీ డిపోను పరిశీలించి ఒక మొక్క నాటారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు.త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. ఆయన వెంట ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నం, ఏటీఎం కమర్షియల్ మాధవ్,అడిషనల్ ఎస్పీలు (అడ్మిన్) ఎన్‌బీఎం.మురళీకృష్ణ, (లా అండ్‌ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు, (క్రైమ్స్) ఎల్.అర్జున్, (ఏఆర్) చెంచిరెడ్డి, డీఎ స్పీలు ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

2,3న మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశాలు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరుగుతాయని మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ పి.లావణ్య వెల్లడించారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సొంతింటి కల నెరవేరుస్తామని ఇళ్లలేని పేదలు, మధ్యతరగతి వారికి గూడు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఆ హామీలు నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు సేపేని రమణమ్మ, యడ్ల లక్ష్మి, శెట్టి నాగమణి, బేగం పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎస్‌వోగా నాగాంజనేయులు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ డీఎస్‌వో నాగాంజనేయులును నియమించి సోమవారమే బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో గల రైస్ మిల్లుకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించడంలో డీఎస్‌వో ప్రసాద్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు సమాచారం. అంతే కాకుండా మంత్రి నాదెండ్ల మనోహర్ రైస్ మిల్లు తనిఖీకి వచ్చినపుడు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదితర కారణాలతో గత డీఎస్‌వో ప్రసాద్‌ను తప్పించినట్టు తెలిసింది.ప్రసాద్‌పై మిల్లర్ల అసోసియేషన్ పలు మార్లు ఫిర్యాదు చేసింది. ఈ మేర కు డీఎస్‌వో ప్రసాద్‌ను రిలీవ్ చేస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు.



ఇసుగేస్తోంది!

గందరగోళంగా ఇసుక విధానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఉచిత ఇసుక అమలు విధానం ఆది నుంచి గందరగోళంగానే ఉంది. మధ్యలో కొద్ది రోజులు బాగానే నడిచినా తిరిగి మామూలైపోయింది. ఎక్కడ ఏం జరుగుతుందో కానీ జిల్లాలో గోదావరి నిండా ఇసుక ఉన్నా దానిని వెలికితీసి సరఫరా చేసే విధానాల్లో సరైన పద్ధతి అవలంబించడంలేదు.ఈ పాటికే జిల్లాలోని అన్ని ర్యాంపులు తెరిచి ఉంటే స్టాక్ పాయింట్లలో ఇసుక కొండలు మాదిరిగా ఉండేది.అన్ని ర్యాంపులకు అనుమతులివ్వక పోవడం. కొన్ని ర్యాంపులకు అనుమతిచ్చినా వాటిని కొనసాగించే పరిస్థితులు లేకపోవడంతో ఇసుక విషయం పెద్ద రచ్చగా మారింది. దీంతో ప్రజా ప్రతినిధులు ,అధికారులు బ్యాడ్ అవుతున్నారు.

ర్యాంపులున్నా..ఏం లాభం

జిల్లాలో అఖండ గోదావరి ఉంది. బ్యారేజీ దిగువన ర్యాంపులు ఉన్నాయి.గోదావరిలో తరగనంత నాణ్యమైన ఇసుక ఉంది. సీతానగరం మండలం, రాజమండ్రి రూరల్ మండలం, తాళ్లపూడి మండ లం, పెరవలి, నిడదవోలు మండలాలపరిధిలో అనేక ఓపెన్ రీచ్‌లకు అనుమతి ఇవ్వొచ్చు.పట్టా భూములు, జిరాయితీ భూముల్లో కూడా అనుమతులు ఇవ్వొచ్చు. కానీ క్షేత్రస్థాయిలో ర్యాంపులు అందుబాటులోకి రావడంలేదు.అనుమతి పొందిన ర్యాంపులు ఓపెన్ కావడంలేదు. జిల్లాలో సుమారు 100కు పైగా బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతిచ్చినట్టు గతంలో అధికారులు ప్రకటించారు. పనిచేయని సొసైటీలపై చర్యలు తీసుకుంటామని సాక్షాత్తూ కలెక్టర్ ప్రకటించారు. బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతిస్తూ కేటాయించిన ఇసుక తీత పూర్తయిన వెంటనే మరిన్ని కేటాయింపులు ఇవ్వాల్సి ఉంది.అక్కడా జాప్యమే జరుగుతోంది. కొవ్వూరు మండలంలోని వాడపల్లి, ఔరంగాబాద్ వంటి బోట్స్‌మన్ సొసైటీలకు ఇప్పటికీ తిరిగి కేటాయింపులు జరపలేదు. గాయత్రికి కేటాయించినా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. కొవ్వూరు వైపు కొన్ని, కోటిలింగాల ర్యాంపులు మాత్రం పనిచేస్తున్నాయి.ఎక్కడా ఇసుక లేకపోవడంతో రాత్రి సమయంలో గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్ చేసేస్తున్నారు.

సమస్యలు..ఓపెన్?

సీతానగరం, పెరవలి తదితర ప్రాంతాల్లో టెండర్లు పిలిచి కొన్ని ర్యాంపులకు అనుమతిచ్చారు. అవి ఇప్పటికీ ప్రారంభం కాలేదు. వేమగిరి ర్యాంపు పనిచేయడంలేదు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరగడంతో వంగలపూడి 1,2, జీడిగుంట ర్యాంపుల్లో కాంట్రాక్టర్ల ఒప్పందాన్ని రద్దు చేసి కొత్తవారికి ఇచ్చారు. అయినా తిరిగి ప్రారంభం కాలేదు.

- ఉచిత ఇసుకతో ఇబ్బంది
- గోదావరి నిండా ఇసుక
- ఓపెన్ కాని ర్యాంపులు
- అంతుపట్టని అధికారుల వైఖరి
- ర్యాంపులపై ప్రచారమే..
- కేటాయింపులు శూన్యం
- అతి చేస్తున్న అధికారులు

పెరవలి, నిడదవోలు మండలాల్లో కూలి రేటుకు పట్టుపట్టడంతో అక్కడ ర్యాంపులన్నీ ఆగిపోయాయి. కాతేరులో ర్యాంపులకు అనుమతి లేదు. మరో 10 ఓపెన్ రీచ్‌లకు, ఆరు సెమీ మెకనైజ్డ్ బోట్లకు త్వరలో అనుమతివ్వనున్నామని, మరో 77 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని చాలా రోజులుగా ప్రకటిస్తున్నారు. కానీ ఇంత వరకూ అమలుకాలేదు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లు క్రమం తప్పకుండానే జరుగుతున్నాయి. కానీ కమిటీలో తీసుకున్న నిర్ణయాలు అమలు జరగడం లేదు.

మాటలే.. చేతల్లేవ్..

జిల్లాలో 9 ఓపెన్ రీచ్‌ల వద్ద 5,51,00 మెట్రిక్ టన్నుల ఇసుక, 10 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద 5,37,018 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని సోమవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ప్రకటించారు. అయితే జిల్లాలో 9 ఓపెన్ రీచ్‌లలో ఒక్కటీ పనిచేయడం లేదు. సెమీ మెకనైజ్డ్ ఓపెన్ రీచ్‌లకు పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.నిడదవోలు మండలం పురుషోత్తపల్లి ర్యాంపునకు వచ్చే నెల 10న, కొవ్వూరు ఆరికరేవులకు 11న,తాడిపూడి ర్యాంపు, ప్రక్కిలంక రీచ్‌లకు 12,పెండ్యాల, చిడిపి, సింగవరం ర్యాంపులకు 13న బహిరంగ వేలం నిర్వ హించనున్నారు.వేమగిరి-ఎ,తీపర్రు-ఏ,బీ, జీడిగుంట -ఏ,బీలు, పందలపర్రుల్లో మెకనైజ్డ్ బోట్ల అనుమతికి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు.

కూటమిలోనూ ఆర్కే కుంపటి?

వైసీపీ ప్రభుత్వం హయాంలోనే గుత్తగా ఇసుక వ్యాపారం చేసిన ఆర్కే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా ఇసుకను ఎక్కువ ధరకు విక్రయించడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

రాజానగరం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అధికారులు బాధ్యతగా పనిచేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. రాజానగరం మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలుల్లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా కలెక్టర్ హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. మండలస్థాయి అధికారులు పూర్తిగా గ్రామ సచివాలయ సిబ్బందిపై ఆధారపడిపోయారని ఈ విధానం సరైంది కాదన్నారు. మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శనలు చేయడం లేనట్టుగా తమ పరిశీలనలో వెలుగుచూస్తున్నాయన్నారు. ప్రధానంగా కొన్ని గ్రామాల్లో తరచూ ఫిర్యాదులు వస్తున్నాయంటే అక్కడ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని అవగతమవుతుందన్నారు. ప్రజలు అధికారులు పనితీరు గమనిస్తూ ఉంటారన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు ఇష్టానుసారం తవ్వితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం మండల వ్యాప్తంగా అర్జీలను కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు స్వీకరించారు. ప్రధానంగా రాజానగరం మండలం నందరాడలోని అడుసుమిల్లి వెంకయ్య చెరువు (ఏవీ ట్యాంకు)లో నీరు దిగువ ప్రాంతానికి పోకుండా కొంత మంది స్వార్థపరులు అడ్డుకట్ట వేస్తున్నారని, దీంతో ఎగువ భాగం నరేం ద్రపురంలో దాదాపు 130 ఎకరాల్లోని పంట పొలాలు ముంపు నకు గురవు తున్నాయంటూ బాధిత రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల భూములకు సంబంధించి వస్తున్న ఎఫ్‌లైన్ పిటిషన్లను ఎందుకు పెండింగ్ పెడుతున్నారంటూ మండల సర్వేయర్ అనితను నిలదీశారు. ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయిన బాధితులకు నష్ట పరిహారం ఇప్పించాలంటూ కొంతమంది బాధితులు వినతిపత్రం అందజేశారు. నందరాడ సొసైటీలో అవకతవకలపై ఫిర్యాదు చేస్తే తనకు తెలియకుండా విచారణ పూర్తి చేశారని అడబాల గణపతిరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైతుల భూ సమస్యలకు సంబంధించి పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రతి సోమవారం మండలస్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు ఎన్ని అర్జీలు వస్తు న్నాయంటూ తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవిని ఆరా తీశారు.కార్యక్రమంలో జేసీ చినరాముడు, డీఎల్‌డీవో వీణాదేవి,తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, ఎంపీడీవో జేఏ ఝూన్సీ, ఎంపీపీ సీతారత్నం పాల్గొన్నారు.



రాజానగరం మండల పీజీఆర్‌ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

సీతారాంపురం కార్యదర్శికి షోకాజ్

సీతారాంపురం పంచాయతీ కార్యదర్శి పని తీరు సక్రమంగా లేదని సర్పంచ్ బొబ్బర వరహాలు ఫిర్యాదు చేశారు. దీంతో కార్యదర్శి డి.ధనలక్ష్మిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేయకపోతే వెళ్లిపోండి, ఎంత కాలం నుంచి చేస్తున్నారు? నిధులు లేవని చెప్పడానికి వీల్లేదంటూ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీకి ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులకు సెలవులు ఇవ్వొద్దని, ఈవోపీఆర్డీ ఎన్ని విజిట్లు చేయాలంటూ ఈవోఆర్డీని వాణిని ప్రశ్నించారు.

కలెక్టరేట్‌లో 100 వినతులు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి డీఆర్‌వో టి.సీతారామమూర్తి అర్జీలు స్వీకరించారు. 96 ఆఫ్‌లైన్ కాగా నాలుగు ఆన్‌లైన్‌లో స్వీకరించారు. గణేష్ చౌక్ రైతు బజార్‌లో బినామీ రైతు పంతగాని సతీష్ మరికొంత మంది గత 20 ఏళ్లుగా వ్యాపారం చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని బేతాల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. వేమగిరికి చెందిన చలపతి రోహిణి తన భర్త సూరిబాబుకు యూనియన్ బ్యాంక్ చెల్లించాల్సిన బీమా పరిహారం చెల్లించడంలేదని విన్నవించారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం సొసైటీ ఉద్యోగులు ధర్నా చేశారు. యూనియన్ పిలుపు మేరకు ధర్నా చేసినట్టు యూనియన్ నాయకులు తోట వెంకటరామయ్యకెవివి సత్యనారాయణ తెలిపారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీజీఆర్ఎస్‌లో అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల నుంచి సుమారు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

మావయ్యను ఇంటి తీసుకెళుతూ మృత్యు ఒడికి 7
ఏసీబీ కేసులో పోర్టు ఆఫీసర్‌కు రెండేళ్ల జైలు



వాషింగ్టన్ టు బుష్



40 మంది అమెరికా అధ్యక్షుల చిత్రాలతో డాలర్ నాణేల ముద్రణ

సేకరించిన కాకినాడకు చెందిన నాణేల సేకరణకర్త జానకిరామ చౌదరి



40 మంది అధ్యక్షుల ముఖ చిత్రాలతో ముద్రించిన డాలర్లు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ సోమవారం రెండోసారి ప్రమాణం చేశారు. కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త మార్ని జానకిరామ చౌదరి ఇప్పటివరకు విడుదలైన 40మంది అమెరికా అధ్యక్షుల డాలర్లను సేకరించారు. ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్ష పీఠం అధిరోహించిన సందర్భంగా ఆ విశేషాలను తెలియజేశారు. ఇంతవరకు అధ్యక్షులుగా 46మంది పనిచేయగా 40మంది అధ్యక్షుల ముఖచిత్రాలతో ఒక డాలరు విలువ కలిగిన నాణేలను అమెరికా ప్రభుత్వం ముద్రించింది. వెనుక భాగంలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చిత్రంతో రాగి, జింక్, మాంగనీస్, నికెల్ మిశ్రమ లోహాలతో విడుదల చేశారు. ఒక్కొక్క నాణెం 8.1 గ్రాముల బరువు కలిగి 26.5 మిల్లీమీటర్ల వ్యాసం, 2 మిల్లీమీటర్ల మందం కలిగి ఉంటుంది. మొట్టమొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ (1789-1797)తో ప్రారంభించి జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్ వరకు 40మంది (మరణించిన అధ్యక్షుల) చిత్రాలతో నాణేలను ముద్రించారు. 2007 నుంచి 2011 వరకు పెద్ద సంఖ్యలో చలామణి కోసం ముద్రించారు. కానీ 2012 నుంచి 2017 సంవత్సరం వరకు విడుదలైన నాణేలను కేవలం సేకర్తల కోసం మాత్రమే ముద్రించారు.



జానకిరామ చౌదరి



ఆకాశంలో హరివిల్లు

యానాం రాజీవ్ గాంధీ బీచ్‌రోడ్డులో సోమవారం ఆకాశంలో అద్భుతమైన హరివిల్లు ఆవిష్కృతమైంది. ఎర్రటి, నీలిరంగు మబ్బులతో చూపరులను కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని యానాం బీచ్‌లోని పర్యాటకులను ఆకట్టుకుంది. దీంతో వారు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- యానాం

ఆపాల్సిందే

- యూనివర్సల్ బయోఫ్యూయెల్స్‌లో ఉత్పత్తి నిలుపుదలకు ఆదేశాలు
- జంతువుల కొవ్వు ఫ్యాటీ యాసిడ్స్‌తో కాలుష్యం
- అనుమతి లేని ముడిపదార్థాల వినియోగం
- నిర్ధారించిన కాలుష్య నియంత్రణ మండలి బోర్డు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విచారణ

సర్పవరం జంక్షన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జంతువుల కొవ్వు ముడి పదార్థాల వినియోగం, దుర్గంధపూరిత దుర్వాసన వెదజల్లుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కంపెనీపై ఎట్టకేలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సముద్ర తీరప్రాంతంలో ఉన్న కంపెనీనుంచి పెద్దఎత్తున దుర్వాసన వెదజల్లుతోందని, విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అధికారులు విచారణ నిర్వహించి అనుమతి లేని ముడిపదార్థాలను ఉపయోగించిందని, పీబీసీ బోర్డు ముందస్తు అనుమతి లేకుండా ముడి పదార్థాలను ఉపయోగించడం.. తిరిగి ప్రారంభించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడడంతో దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినట్లు అధికారులు గుర్తించారు.

డిసెంబరు రెండో వారంలో ఫిర్యాదు

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి ఇండస్ట్రియల్ పార్కులో యూనివర్సల్ బయోఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పారిశ్రామిక యూనిట్లనుంచి దుర్వాసన వస్తుందని ప్రజలు అధికారులకు డిసెంబరు రెండో వారంలో ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదుల మేరకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు డిసెంబరు 20, 21వతేదీల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీబీసీ బోర్డు అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలు, లోపాలపై మానిటరింగ్ కమిటీ సమావేశం డిసెంబరు నెలాఖరున నిర్వహించారు. జంతువుల టాలో ఆయిల్ అందుకుని, ప్రిగోరిఫికో అల్లానా ప్రైవేట్ లిమిటెడ్, ఔరంగాబాద్, మహారాష్ట్ర ప్రాంగణంలోని నిల్వ ఉన్న ట్యాంకుల్లో 4.535టన్నుల క్రూడ్ యానిమల్ టాలో ఆయిల్ నిల్వ చేసినట్లు గుర్తించారు. నిల్వ చేసిన టాలో ఆయిల్ రిఫైన్డ్ లేదా క్రూడ్ అని నిర్ధారించేందుకు నిల్వ ట్యాంకుల్లో(ట్యాంకు నెంబరు 6003), యానిమల్ టాలో ఆయిల్‌లోని ఫ్రీ ఫ్యాటీయాసిడ్(ఎఫ్ఎఫ్ఏ) కంటెంట్‌ను పొల్యూషన్ నియంత్రణ బోర్డు (పీబీసీ) అధికారులు గుర్తించారు. శుద్ధి చేసిన టాలో ఆయిల్‌లో 0.20శాతం నుంచి 0.62నుంచి 0.69శాతం వరకు నిల్వ చేసిన యానిమల్ టాలో ఆయిల్ ఫ్రీ ఫ్యాటీ యాసిడ్(ఎఫ్ఎఫ్ఏ) 0.62నుంచి 0.69 పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. ఇది నిబంధనలకు వ్యతిరేకంగా పరిశ్రమ శుద్ధి చేయకుండా ముడి జంతు నూనె ఉపయోగిస్తుందని అధికారులు గుర్తించారు. పరిశ్రమ తమ డియోడరైజర్ ప్లాంట్‌లోని క్రూడ్ టాలో ఆయిల్‌లో ఎఫ్ఎఫ్ఏను తగ్గిస్తోందని, స్క్రబ్బర్‌ను వాతావరణంలోకి విడుదల చేసిన తర్వాత ఘనీభవించిన వాయువులు(కీటోన్స్, అమైన్‌లు) నేరుగా విడుదల చేయడంతో తీరప్రాంత గ్రామాలతోపాటు రమణయ్యపేట, వలసపాకల, తిమ్మాపురం తీవ్రమైన దుర్వాసన వెదజల్లినట్లు నిర్ధారించినట్లు కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరరావు తెలిపారు. దీంతోపాటు నవంబరు, డిసెంబరు నెలల్లో 165.46 టన్నుల జెమినీ, ఎడిబుల్ ఆయిల్, ఫ్యాట్స్ ఇండియానుంచి 92.67 టన్నులు, అదానీ విల్మార్‌నుంచి 72.79 టన్నులు యాసిడ్ ఆయిల్ పొంది సమీపంలో యాసిడ్ ఆయిల్‌ని ఉప ఉత్పత్తిగా ఉత్పత్తి చేస్తూ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు గుర్తించామన్నారు. 2024లో బయో డీజిల్ ఉత్పత్తిలో ఎడిబుల్ ఆయిల్ యూనిట్లు ఉపయోగిస్తామన్నారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వెదజల్లి మరింత పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయన్నారు. యూనివర్సల్ బయోఫ్యూయల్స్ సంస్థ నిబంధనలు ఉల్లంఘించడంతో కంపెనీ ఉత్పత్తిని నిలుపుదల చేస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పరిశ్రమ తదుపరి కార్యకలాపాలు అన్నింటినీ తక్షణమే నిలిపివేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. 2018లో కూడా ఈ కంపెనీ యానిమల్ ఫ్యాట్, టాలో ఆయిల్ వంటి ముడి పదార్థాలు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించడంతో ఆరునెలలపాటు కంపెనీలో కార్యకలాపాలు జరగకుండా మూసివేత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉత్తర్వులకు వ్యతిరేకంగా పరిశ్రమ కార్యకలాపాలు నిర్వహించినట్లు తేలితే కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం, 1988లో సెక్షన్ 41(2) ప్రకారం వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం ప్రకారం మొదటి తరగతి న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్‌కు గురవుతారని హెచ్చరించారు.

హోరాహోరీగా బ్రాహ్మణ పురోహితుల క్రికెట్ పోటీలు



హర్షకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంటు పోటీలు మూడోరోజు హోరాహోరీగా జరిగాయి. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం అన్నవరం-నర్సీపట్నం జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ఈ పోటీలో అన్నవరం జట్టు విజయం సాధించింది. కాకినాడ రుద్రాస్-వైజాగ్ లయన్స్ జట్ల మధ్య పోటీలో కాకినాడ రుద్రాస్ విజయం సాధించింది. నర్సీపట్నం-కాత్రేనికోన జట్ల మధ్య పోరులో నర్సీపట్నం జట్టు విజయం సాధించింది. అన్నవరం జట్టు క్రీడాకారుడు హర్ష మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా ఎంపిక కాగా పట్టణ సీఐ పి.వీరబాబు షీల్డు అందజేశారు. కాకినాడ రుద్రాస్ జట్టు కెప్టెన్ మాధవశర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు షీల్డు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పాలూరి సత్యానందంతో పాటు పలువురు రాజకీయ రంగ ప్రముఖులు క్రీడా పోటీలను తిలకించారు. కర్రా శివయ్య, పిండి మూర్తి, వేదుల భరద్వాజ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికత.. స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టి

ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికత, స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టిసారించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను ఆప్టిమైజ్ చేసేందుకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుందని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ ట్రైనింగ్ లెర్నింగ్(అటల్) అకాడమీ సహకారంతో ఈనెల 25వరకూ ఆరురోజులపాటు నిర్వహించే ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ ఆప్టిమైజింగ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్ విత్ స్మార్ట్ మెటీరియల్స్ స్టోరేజ్ సొల్యూషన్స్ అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం వీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే 50 ఏళ్లలో ప్రపంచం మొత్తం వీటిపై ఆధారపడే ముందుకు వెళుతుందన్నారు. మొత్తం 9 రాష్ట్రాల నుంచి 138 మంది అధ్యాపకులు ఎఫ్‌డీపీకి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొనగా వీవీ సుబ్బారావు సమన్వయకర్తగా వ్యవహరించగా డాక్టర్ డి.లింగరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

మనసువిప్పి మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం

- సందేశాత్మకంగా సాగిన 'విడాకులు కావాలి' నాటిక
- భోగాపురంలో ముగిసిన జాతీయస్థాయి నాటికల పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా 'నా శత్రువు' నాటిక ఎంపిక

మనసువిప్పి మాట్లాడుకుంటే దంపతుల మధ్య సమస్యల పరిష్కారమవుతాయి. అంతేగాని పంతాలకు వెళ్లి విడాకులకు దారితీసే పరిస్థితులు తెచ్చుకోవద్దని సందేశమిస్తూ సాగింది గుంటూరుజిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన విడాకుల కావాలి నాటిక.

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వ ర్యంలో జరుగుతున్న కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయస్థాయి నాటికల పోటీలు నాల్గవరోజు ప్రదర్శించిన ఈ నాటిక ప్రస్తుతం చిన్న చిన్న విభేదాలతో విడిపోతున్న దంపతులకు హితవు పలుకుతూ దాంపత్య జీవితం ఎలా ఉండాలో వివరించింది. అహంకారంతో పట్టుదలకు పోకుండా సర్దుబాటు ధోరణితో సంయనం పాటించడం ద్వారా ఆదర్శ దంపతులుగా గడపవచ్చునని చాటిచెప్పింది. భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతి సంప్రదాయాలే దాంపత్య జీవితాలను అన్యోన్యంగా నడిపే దారిదీపాలని, ఇచ్చిపుచ్చుకునే సంస్కారం దాంపత్యాన్ని ఆనందమయం చేస్తుందని తెలియజెప్పింది. వల్లూరి శివప్రసాద్ ఈ నాటికను రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.

ముగిసిన నాటిక పోటీలు

భోగాపురంలో నాలుగు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి నాటికల పోటీలు సోమవారం తెల్లవారుజామునతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్నాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు తొమ్మిది నాటికలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు ప్రదర్శించిన నా శత్రువు నాటిక ఎంపిక కాగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ద్వారబంధాల చంద్రయ్యనాయుడు(గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్), తృతీయ ప్రదర్శనగా ఇది రహదారి కాదు (హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్), ఉత్తమ జ్యూరీ ప్రదర్శనలుగా అసత్యం (ఉక్కునగరం చైతన్య కళాస్రవంతి), ఉక్కు సంకెళ్లు(హైదరాబాద్ మహతి క్రియేషన్స్) నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ రచనగా ఇది రహదారి కాదు నాటిక రచయిత ఆకురాత్రి భాస్కరరావు, ఉత్తమ దర్శకత్వం పి.కృష్ణహితేష్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ఉత్తమ నటుడిగా పి.బాలాజీనాయక్(అసత్యం), ఉత్తమ నటిగా సునయన (నా శత్రువు), ఉత్తమ విలన్‌గా శరత్‌కుమార్(ఉక్కుసంకెళ్లు), ఉత్తమ ద్వితీయ నటుడిగా జరుగుల రామారావు(ప్రేమించే వయసేనా), ద్వితీయ నటిగా బండారు నాగరాణి (ఇది రహదారి కాదు), ఉత్తమ బాలనటిగా యష్మిత(నా శత్రువు), ఉత్తమ సహాయ నటుడిగా మురళీమోహన్(చీకటి బతుకులు), సహాయ నటిగా వసంతయామిని(విడాకులు కావాలి), ఉత్తమ సంగీతం సురభి నాగరాజు(ఇది రహదారి కాదు), ఉత్తమ ఆహార్యంగా వీవీ సత్యనారాయణ(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ఉత్తమ రంగాలంకరణగా థామస్(విడాకులు కావాలి), ఉత్తమ రంగోద్దీపనగా కృష్ణహితేష్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ప్రత్యేక ప్రశంసగా చీకటి బతుకులు నాటిక, నటుడిగా ఎన్ఎస్ఎస్ ప్రసాద్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు ఎంపికయ్యారు. వీరికి భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు, మార్కండేయ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు న్యాయవాది పడాల రవి, పలువురు ప్రముఖ కళాకారుల ద్వారా నగదు పురస్కారాలు, వారాహి అవార్డులు అందజేశారు. ఈ నాటికల పోటీలకు న్యాయనిర్ణేతలుగా మహ్మద్ ఖాజావలీ, ఎంవీ రమణ, ఎం.తాతికొండలు వ్యవహరించారు.



జాతీయస్థాయి నాటిక పోటీల్లో ప్రదర్శించిన విడాకులు కావాలి నాటికలోని సన్నివేశం





జాతీయస్థాయి నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన నా శత్రువు నాటికకు వారాహి అవార్డు, ఉత్తమ పురస్కారాన్ని అందజేస్తున్న భోగాపురం నాటక కళా పరిషత్ ప్రతినిధులు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటికకు పురస్కారం, వారాహి అవార్డు అందజేస్తున్న దృశ్యం

లలితా జ్యూయలరీ తునికి రావడం శుభ పరిణామం

- మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు
- తునిలో అట్టహాసంగా లలితా జ్యూయలరీ ప్రారంభోత్సవం



లలితా జ్యూయలరీ అధినేత కిరణ్‌కుమార్‌తో కలిసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



సంస్థ చైర్మన్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ నగల వ్యాపార సంస్థ లలితా జ్యూయలరీ తునికిరావడం శుభ పరిణామమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తునిలో లలితా జ్యూయలరీ 59వ షోరూం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. తుని మెయిన్‌రోడ్డులో నూతన హంగులతో రూపుదిద్దుకున్న లలితా జ్యూయలరీ మాల్‌ను మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, లలితా జ్యూయలరీ అధినేత డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ గతం మాదిరిగా తునిలో అరాచక పరిస్థితులు లేవని, కూటమి ప్రభుత్వం రాకతో తునిలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ఫలితంగా వ్యాపార కేంద్రంగా ఎంతో అభివృద్ధి చెందిన తునికి కార్పొరేట్ సంస్థలు వ్యాపారాలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. పెద్దఎత్తున వ్యాపార సంస్థలు కొలువు తీరితే తుని పట్టణం అభివృద్ధి చెందుతుందని, క్రయ విక్రయాలు జరుగుతూ ఉంటే ట్యాక్స్‌ల రూపాన ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని, ఆదాయం వస్తే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. దీంతోపాటుగా యువతకు ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని యనమల స్పష్టం చేశారు. లలితా జ్యూయలరీ చైర్మన్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ తనకు వ్యక్తిగతంగా ఆత్మీయుడని ఆయన ఆహ్వానం మేరకు తునిలో లలితా జ్యూయలరీ షోరూంను ప్రారంభించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. లలితా జ్యూయలరీ అధినేత డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బంగారం కొనుగోలు ఇప్పుడు సాధారణ విషయంకాదని, నగలు కొనేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అచ్చొచ్చిన చోటు అని ఎన్నో సంవత్సరాలు ఒకేచోట కొంటున్నామనే ఉద్దేశంతో అధిక ధరలకు, అధిక తరుగుకు నగలు కొనడం కరెక్ట్‌కాదని స్పష్టం చేశారు. తెలివైన నిర్ణయంతో నగలు కొనాలని కోరారు. లలితా జ్యూయలరీలో నగలు కొనాలని చెప్పడం లేదని లలితలో మీకు నచ్చిన నగడుకు ఎస్టిమేట్ స్లిప్ ఫొటోలు తీసుకుని నాలుగైదు షోరూంలో ధరలు పోల్చి ఎక్కడ ధర తక్కువో అక్కడే నగలు కొనుగోలు చేయాలని తెలిపారు. ఇలా పోల్చిచూడమని ఇతర నగల షోరూంలు చెప్పిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నిస్తూ ఇది మా పారదర్శకత అని తెలిపారు. తుని ప్రజలతో తనకు మరింత అనుబంధం ఏర్పడిందని తెలుగుతనం ఉట్టిపడే ఈ ప్రాంతంలో కొత్తషోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని బంగారు నగలుపై మార్కెట్ కంటే 2శాతం తగ్గింపుతోపాటుగా వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.6వేలు తగ్గిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు నగలు కొనుగోలు చేసేందుకు తరలి రావడంతో మెయిన్‌రోడ్డు సందడిగా మారింది. డబ్బులు ఊరికే రావంటూ తెలుగు రాష్ట్ర ప్రజానీకానికి సుపరిచితుడై తన షాపులకు తానే ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు పొందిన కిరణ్‌కుమార్‌తో కొనుగోలుదారులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. సంస్థ చైర్మన్ కిరణ్ కుమార్ ఆధ్యాత్మం ఆత్మీయ పలకరింపుతో అందరినీ ఆకట్టుకుంటూ లలితా జ్యూయలరీ మాల్ ప్రారంభోత్సవంలో ఎట్రాక్షన్‌గా నిలిచారు.

రేపు బాలికల హాకీ జిల్లా జట్టు ఎంపిక

కాకినాడఅర్బన్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): బాలికల సబ్ జూనియర్ హాకీ జిల్లా జట్టు ఎంపిక ఈనెల 22న కాకినాడ డీఎస్ఏ మైదానంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తారని హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 27నుంచి 29వరకు అనంతపురంలో జరిగే అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాలికల హాకీ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు.

రెండోరోజు అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళామందిరంలో సంక్రాంతి గాన సభల పదిరోజుల కార్యక్రమాల్లో రెండోరోజు పతంగి సోదరుల(శ్రీ దాత్రే, ధృవ్) చెన్నైవారి గాత్ర కచేరి అద్భుతంగా జరిగింది. వారు సౌరాష్ట్ర రాగంలో శరణు సిద్ధి వినాయక, విద్వాన్ చిత్రవీణ ఎన్.రవికిరణ్ శ్రీశైలం మల్లికార్జునేశ్వరుడిపై కేదారగౌళ రాగంలో రచించిన ద్వాదశ జ్యోతిర్లింగ గీత మాల రేయి పగలు నిన్నే నమ్మినాడు, పంతువరాళి రాగంలో ఎన్నగాను రామభజన, కమాస్ రాగంలో బ్రోచేవారెవరురా కీర్తనలు గానంచేసి మైమరపించారు. వీరికి వయోలిన్‌పై బండే మాధవన్, చెన్నై, మృదంగంపై కె.యోగీష్, ఘటంపై శ్రీ సరస్వతుల హనుమంతరావు చక్కటి సహకారాన్ని అందించారు. ఆలపాటి లక్ష్మి సుభద్ర, సుభాషిణి, పంతం నాగేశ్వరి, చావలి సూర్యకుమారి, కె.సుబ్బలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు.

దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- కల్నల్ హెచ్ఎస్ మానిక్
- శ్రీప్రకాష్‌లో కొనసాగుతున్న చెస్ పోటీలు

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ సాటి మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దబడాలని మూడో ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్ఎస్ మానిక్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఐదురోజులపాటు జరుగనున్న జాతీయస్థాయి స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల నాల్గవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా సోమవారం హాజరై మాట్లాడారు. క్రీడాకారులు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. చెస్ క్రీడ ద్వారా మేధస్సు పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం చెస్ క్రీడలను తిలకించారు. కల్నల్ మానిక్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది నరసింహన్, వైడీ రామారావు, డాక్టర్ విజయనరసింహన్, డీఎఫ్‌వో వీరన్న, పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



కల్నల్ మానిక్‌ను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

ఏపీఎస్పీ బెటాలియన్‌ను సందర్శించిన డీజీపీ తిరుమలరావు


డీజీపీకి మొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న కమాండెంట్ దీపిక పాటిల్

సర్పవరం జంక్షన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌ను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బెటాలియన్‌కు చెందిన ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఏపీఎస్పీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, కమాండెంట్ దీపిక పాటిల్, అసిస్టెంట్ కమాండెంట్ దేవానంద రావు తదితరులున్నారు.



ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న డీజీపీ

కాకినాడ ఆర్టీసీ డిపో సందర్శన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సోమవారం కాకినాడ డిపోను సందర్శించారు. డిపో పరిసరాలను పరిశీలించి గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్స్ ఎస్‌జీ.రావు, వీఎన్.మూర్తికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గొల్ల విజయరత్నం, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకరావు, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం.బాషా, పీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు పాల్గొన్నారు.

బస్సు రూపంలో మృత్యువు

● రాజమహేంద్రవరంలో బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ● గంటల తేడాలో మేనమామ, మేనల్లుడు మృతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తన మావయ్యను ఇంటి వద్ద దింపడానికి బైక్‌పై బయలుదేరిన యువకుడు తన మామతో పాటు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వర్‌నగర్‌కు చెందిన మేడిశెట్టి ప్రసాద్ (53) అంబేద్కర్‌వాది. అతడు ఆదివారం పంగిడిలో జరిగిన ఎయిమ్ సమావేశానికి వెళ్లాడు. సమావేశం అనంతరం వేరొకరి కారులో రాత్రి 10 గంటలు దాటాక రాజమహేంద్రవరం దానవాయిపేటలో నివాసం ఉంటున్న అతడి మేనల్లుడు నక్క సాయికృష్ణ (23) వద్దకు వచ్చారు. విజయవాడకు చెందిన సాయికృష్ణ రాజమహేంద్రవరంలోని మెడికల్ కంపెనీలో మూడేళ్లుగా పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ప్రసాద్ అతడి వద్దకు వచ్చి తనను లాలాచెరువులోని ఇంటి వద్ద దింపాలని అడిగారు. దీంతో తెలిసిన వ్యక్తి వద్ద బైక్ తీసుకుని నెహ్రూనగర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల సెంటర్‌కు చేరుకుని రోడ్డు దాడుతుండగా డివైడర్ వద్దకు వచ్చి అటు వైపు నుంచి ఆటో వస్తుందని ఆగారు. ఇంతలో లాలాచెరువు వైపు నుంచి వస్తున్న కాకినాడ-హైదరాబాద్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి వారి బైక్ వెనుక భాగంలో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బస్సును నిలుపుదల చేసి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అర్ధరాత్రి ఇద్దరి పరిస్థితి విషమించి గంటల తేడాలో మృతిచెందారు. కాగా మేడిశెట్టి ప్రసాద్ ఆటోనగర్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయికృష్ణకు తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబానికి అతడే దిక్కు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదం ప్రదేశంలో పడి ఉన్న ప్రసాద్, సాయి కృష్ణ

పాపికొండలకు ఎస్టీ కమిషన్ చైర్మన్


బోటులో వెళ్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

దేవీపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, మరికొంతమంది ప్రజాప్రతినిధులు పర్యాటక బోటుపై సోమవారం వెళ్లారు. గండిపోశమ్మ తల్లి ఆలయ సమీపంలోని బోటు పాయింటు వద్ద విహార యాత్ర ప్రారంభించారు. చైర్మన్ రాకతో గోదావరి నదీ పరివాహక ప్రాంతమంతా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ప్రత్యేకంగా తనిఖీలు జరిపారు.

పోలవరం భూసేకరణ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా అభిషేక్

రాజమహేంద్రవరం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): పోలవరం భూసేకరణ (ఆర్‌అండ్‌ఆర్) ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ఐఏఎస్ అధికారి వి.అభిషేక్ నియమితులయ్యారు. ఆయన ఇంతవరకూ పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసరుగా పనిచేశారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

బంగారం కోసం బలి తీసుకున్నాడు!

మహిళ అనుమానాస్పద మృతి

మిస్టరీని ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్టు


మరణించిన మహాలక్ష్మి (ఫైల్‌ఫొటో)

ద్రాక్షారామ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం తోటపేటలో మహిళ అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. బంగారం కోసం మహిళను గొంతు నులిమి హత్య చేసినట్టు దర్యాప్తులో పోలీసులు తేల్చారు. సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తోటపేటకు చెందిన దామిశెట్టి మహాలక్ష్మి అలియాస్ ఇడ్లీ లక్ష్మి(54) తోట త్రిమూర్తులు కాలనీలో ఒంటరిగా నివసిస్తున్నది. ఈనెల 12న ఇంట్లో ఆమె మరణించింది. ఈ మరణంపై అనుమానం రాకపోవడంతో బంధువులు ఆమె మృతదేహాన్ని క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ద్రాక్షారామ శ్మశానవాటికలో పూడ్చిపెట్టారు. ఇంట్లో ఆమె బంగారు వస్తువులు కనిపించకపోవడంతో అల్లుడు, బంధువులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం జరిపారు. అనంతరం కేసు విచారణ చేపట్టారు. తోటపేటకు చెందిన నాగిరెడ్డి అప్పారావు అలియాస్ బాబి ఆమెను హత్య చేసి బంగారం గొలుసు, వేలికి ఉంగరం తీసుకెళ్లినట్టు దర్యాప్తులో తేల్చారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

పట్టించిన బంగారు వస్తువులు

ఈ హత్యకేసులో నిందితుడిని బంగారు వస్తువులు పట్టిచ్చాయి. ఆమె మృతిపై తొలుత అనుమానం రాకపోవడంతో బంధువులు అంత్యక్రియలు చేశారు. తదుపరి బంగారు వస్తువుల కోసం వెతకగా కనిపించలేదు. దీంతో ఆమె అల్లుడు, బంధువులు మహాలక్ష్మి పనిచేసే స్టీలు హౌస్‌కు వెళ్లి వాకబు చేశారు. ఈనెల 11న బంగారు వస్తువులు వేసుకుని ఆమె పనికి వచ్చినట్టు స్టీలు హౌస్ యజమాని తెలిపారు. దీంతో అనుమానం మరింత బలపడింది. బంగారు వస్తువుల ఫొటోలతో తాకట్టు దుకాణాల వద్దకు వెళ్లి విచారించారు. ద్రాక్షారామలోని ఒక బంగారం షాపు వద్ద నిందితుడు అప్పారావు తాకట్టు పెట్టినట్టు తేలింది. దీంతో ఆమె అల్లుడు సురేష్ తన అత్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణతో మిస్టరీ వీడింది.

'అన్నవరం' ఖజానాకు రూ.81.84 లక్షలు

దేవస్థానంలో ఫొటోలు తీసుకునే లైసెన్స్‌కు టెండర్ కం బహిరంగవేలం

అన్నవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో దర్శనం, వ్రతమాచరించుకునే భక్తులకు, పోలరైడ్ ఫొటోలు తీసుకునే లైసెన్స్ హక్కు ద్వారా స్వామివారి ఖజానాకు ఏడాదికి రూ.81.84 లక్షలు ఆదాయం దక్కనుంది. సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగవేలం నిర్వహించగా నెలకు రూ.6.82 లక్షలు దేవస్థానానికి చెల్లించేందుకు గుత్తేదారు ముందుకొచ్చారు. ఇదే లైసెన్స్ హక్కుకు గతేడాది రూ.53.40 లక్షలు ఆదాయం లభించింది. పోలరైడ్ ఫొటోలు లైసెన్స్ ద్వారా రికార్డుస్థాయి ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. వీటితోపాటుగా వివిధ ప్రాంతాల్లో టీ, కాఫీ విక్రయించేందుకు రెండు దుకాణాలకు వేలం నిర్వహించగా ఏడాదికి ఒకషాపునకు రూ.3లక్షలు, మరో షాపునకు రూ.3.48 లక్షలు హెచ్చుపాటలు వెళ్లినట్లు దేవస్థానం లీజుల విభాగం అధికారులు తెలిపారు.

మాజీ మంత్రి పితాని పూజలు

అన్నవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


వేదాశీర్వచనం అందుకుంటున్న పితాని

త్రుటిలో తప్పిన ప్రమాదం

పంట పొలంలోకి

దూసుకుపోయిన ఓల్వా బస్

50 మంది

ప్రయాణికులు సురక్షితం



పొలంలోకి దూసుకుపోయిన బస్

ప్రత్తిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై సోమవారం పంట పొలంలోకి ఓల్వా బస్సు దూసుకువెళ్లింది. స్థానిక బైపాస్ రహదారిలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే ఓల్వా బస్సు అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకువెళ్లింది. బస్సులో 50 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పినట్టు అయింది. టైర్ పంక్చర్ అవడం వల్లే బస్సు అదుపు తప్పిందని స్థానికులు తెలిపారు. దీంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అవినీతి కేసులో పోర్టు అధికారికి జైలు శిక్ష, జరిమానా

కాకినాడ క్రైం/రాజమహేంద్రవరం సిటీ జనవరి 20(ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో గతంలో పోర్టు ఆఫీసర్‌గా పనిచేసిన మనం వెంకట కృష్ణమోహన్‌కు రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు రెండేళ్ల జైలు శిక్షవిధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఐ.సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన షేక్ అహ్మద్ అలీషాకు కాకినాడ పోర్టు ఏరియాలో స్థలాన్ని కేటాయించి బార్జి మరమ్మతుల కోసం అనుమతిని జారీ చేసేందుకు మనం వెంకట కృష్ణమోహన్ 2009 జూన్ 15న రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు ట్రాప్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో కృష్ణమోహన్ నేరం చేసినట్టు రుజువు కావడంతో రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ 7 ప్రకారం ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమాన, యూ/ఎస్ 13(1)(డి) అవినీతి నిరోధక చట్టం ప్రకారం 2 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయబడతాయని తెలిపారు. ఈ కేసులో పీపీ ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు. కేసును ప్రస్తుత డీఎస్పీ దర్యాప్తు చేశారు. ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ(ఏసీబీ) వి.సుబ్బరాజు, డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

యువతి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): యువతి మృతికి కారకుడైన వ్యక్తికి న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం పదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ ఎస్సీఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే 2015లో గోకవరం గ్రామానికి చెందిన యువతి స్వాతిని పిల్లి ఆనంద్‌బాబు ప్రేమిస్తున్నానని వెంటబడి శారీరకంగా ఇబ్బంది పెట్టేవాడు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. దీంతో ఆనంద్‌బాబుపై పలు సెక్షన్ల కింద ఎస్ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేయగా నార్త్ జోన్ డీఎస్పీ ప్రసన్నకుమార్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.6 వేలు చొప్పున జరిమాన విధించారు. ఈ కేసులో ఇతర నిందితులైన ఏ2, ఏ3లపై అభియోగాలను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో స్పెషల్ ఏపీపీలు ఐ.వెంకటరత్నం, కె.రాధాకృష్ణరాజు వాదనలు వినిపించారు.

పండక్కి వచ్చి తిరిగెళ్తూ అనంతలోకాలకు..

» గురజాడలో డివైడర్‌ను ఢీకొన్న బైక్

» తీవ్రగాయాలతో ఇద్దరు యువకులు మృతి

» మృతులది కాకినాడ జిల్లా


ఘటనా స్థలంలో నాగవీరభద్ర దుర్గ మృతదేహం

పమిడిముక్కల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగింది. పమిడిముక్కల పోలీసుల కథనం ప్రకారం... కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ముక్తా నాగవీరభద్ర దుర్గ(20), పిఠాపురానికి చెందిన దాసరి నిమ్మిచంద్ర(21) హైదరాబాద్‌లో ఉంటూ సంక్రాంతికి స్వస్థలానికి వచ్చారు. పండగ సెలవులు ముగియడంతో ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ బయలుదేరారు. అయితే వారు ప్రయాణిస్తున్న బైక్ పమిడి ముక్కల మండలం గురజాడ సమీపంలో హైవేపై ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాగ వీరభద్ర దుర్గ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన చంద్ర విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటబోదెలో ద్విచక్రవాహనం పడి వ్యక్తి మృతి

ద్రాక్షారామ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వద్ద సోమవారం ఉదయం ద్విచక్రవాహనం అదుపు తప్పి పంటబోదెలో పడిపోవడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెలంపాలెం గ్రామానికి చెందిన కోటిపల్లి జ్యోతిబాబు(38)వెల్డింగు పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో జ్యోతిబాబు వాహనంతోపాటు బోదెలో పడిపోయినట్లుగా అతడి భార్యకు ఫోన్‌ద్వారా సమాచారం అందింది. బంధువులతో కలసి వెళ్లి 108 అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. ద్రాక్షారామ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు..

కాకినాడ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన కాకినాడలో జరిగింది. స్థానిక దుమ్ములపేటకు చెందిన దోని గంగరాజు (46) చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూంటాడు. ఈనెల 18న స్థానిక కుంభాభిషేకం రేవు నుంచి నాటు పడవపై వేటకు వెళ్లాడు. రాత్రి అయినా వేట నుంచి ఇంటికి రాకపోయే సరికి అతడి భార్య సింహాద్రి బంధువులతో కలసి తీరప్రాంతంలో గాలింపు చేపట్టింది. ఆచూకీ కానరాలేదు. దీంతో పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఆదివారం సాయంత్రం సముద్రంలో గంగరాజు విగతజీవిగా తేలియాడాడు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోర్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మడ అడవులను సందర్శించిన ఎఫ్‌ఆర్‌వో శిక్షకులు

తాళ్లరేవు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఫారెస్ట్ ఎఫ్‌ఆర్‌వో శిక్షకులు 34మంది కోరింగ అభయారణ్యంలో మడఅడవులను సోమవారం సందర్శించారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షకులకు మడఅడవుల విశిష్టత, వన్యప్రాణుల ప్రాధాన్యత, అడవులో సంచరించే జీవజాతుల వివరాలు తెలియజేశారు. డిప్యూటీ డీఎఫ్‌వో విషాహం, ఎఫ్ఎస్‌వో కె.సిద్దార్థ, ఎఫ్‌బీవోలు మహేష్, గోపి నాగేంద్ర, మధు, సంధ్యారాణి,ధనలక్ష్మి ఉన్నారు.


జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

ఏడీబీ రహదారిలో భారీ అగ్ని ప్రమాదం


ఎగసిపడుతున్న మంటలు

సుమారు 40 అడుగుల పైబడి మంటలు

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో స్థానిక వాలుతిమ్మాపురం జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ సామగ్రి దగ్ధమైంది. సమీపంలో ఉన్న ఓ పరిశ్రమ ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాస్టిక్ సామగ్రిని ప్రమాదం జరిగిన ప్రదేశంలో డంపింగ్ చేసింది. కాల్చిపారవేసిన సిగరెట్ కారణంగా వ్యర్థాలకు నిప్పు అంటుకుని మంటలు ఎగసిపడినట్టు తెలుస్తోంది. సుమారు 40 అడుగుల పైబడి మంటలు ఎగసిపడ్డాయి. భారీగా పొగ కమ్మే యడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలోనే పెట్రోలు బంకు ఉండడంతో మరింత ఆందోళన కలిగించింది. సమాచారం అందుకున్న పెద్దాపురం అగ్నిమాపకసిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పెద్దాపురంతో పాటు జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడ నుంచి అగ్నిమాపక శకటాలు చేరుకుని మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించారు. ఈ ప్రమాదంలో రూ.లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఆర్థిక ప్రయోజనాలు ఆశించి ప్లాస్టిక్ సామాగ్రికి నిప్పు పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అగ్నిమమాపక సిబ్బంది ఎంత మేరకు నష్టం వాటిల్లిందో అంచనా వేస్తున్నారు.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు డీఎల్ఎస్ఏ మందిరంలో సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని జ్యుడీషియల్ అధికారులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వ కాన్సెప్ట్ అండ్ టెక్నిక్‌లపై శిక్షణ నిర్వహించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఎంసీపీసీ యాక్ట్ ప్రకారం 2023 ప్రొవిజన్ ప్రకారం జ్యూడిషియల్ అధికారులు, న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. హైకోర్టు సూచనల మేరకు జ్యూడిషియల్ అధికారులు, న్యాయవాదులను నామినేట్ చేసి కేసులను పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుతుందన్నారు. శిక్షణలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయిత్రిదేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, సీనియర్ శిక్షకులు సురీందర్ సింగ్(ఢిల్లీ),ఎస్.అరుణాచలం (తమిళనాడు),అధికారులు, న్యాయవాదులు ఉన్నారు.

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై మాజీ ఎంపీ హర్షకుమార్ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీటీడీ పాలక మండలి, ఈవో, జేఏవోలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం స్టేషన్‌కు వెళ్లిన ఆయన తన ఫిర్యాదును పోలీసులకు అందించి రసీదు పొందారు. తొక్కిసలాటలో ఆరుగురు మరణానికి కారకులుగా టీటీడీ చైర్మన్, ఈవో, జేఈవోపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు.

వివాహిత అనుమానాస్పద మృతి


గింజాల బాల (ఫైల్)

కొత్తపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా మూలపేటలో సోమవారం జరిగింది. స్థానిక ప్రకాష్‌నగర్‌కు చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాల(25)ను 8 ఏళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇటీవల ప్రసాద్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో తరచూ గొడవలు జరిగేవని బాలతల్లి గింజాల లక్ష్మి తెలిపింది. తన కుమార్తెను వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతో అత్తింటివారే హత్య చేసి మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టారని కొత్తపల్లి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రావులపాడు జాతీయ రహదారి వంతెన సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... 30ఏళ్ల పైబడి ఉన్న పురుష మృతదేహంపై ఎరుపు రంగు షర్ట్, లేత గోధుమరంగు కాటన్ ప్యాంట్ ఉన్నాయి. చనిపోయిన వ్యక్తి లారీ క్లీనర్ గాని డ్రైవర్ అయి ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి బంధువులు గుర్తుపట్టేందుకు మార్చురీలో ఉంచినట్టు పోలీసులు చెప్పారు.


రావులపాడు వద్ద పోలీసులు గుర్తించిన మృతదేహం

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి


ఏఎంజీ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల

ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మురమండ ఏఎంజీ నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం చేయించి మురుగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. సోమవారం మురమండ ఏఎంజీ నగర్‌లో ఆయన పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందన్నారు. ఈ ఏఎంజీ నగర్‌లో మురుగునీరు పోయే విధంగా డ్రైనేజీలు ఏర్పాటుతో పాటు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.. గత వైసీపీ పాలన వలనలో గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో చొరవ చూపలేకపోయిందని, దోచుకోవడం, దాచుకోవడంగా వైసీపీ పాలన సాగిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వెలుగుబంటి నాని, వట్టికూటి జానకీరామ్, దేవళ్ల రాంబాబు, పాటంశెట్టి రాంజీ, డీఈ రవి, ఎంపీడీవో రమేష్, తహశీల్దారు పోశియ్య తదితరులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో అర్జీలు పరిష్కరించాలి

పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ నరసింహకిశోర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిర్ధేశించిన సమయంలో చట్ట పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీజీఆర్ఎస్‌లో వచ్చి ప్రతీ పిర్యాదు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలన జరగాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై స్వయంగా బాధితులతో మాట్లాడిన ఎస్పీ నేరుగా పోలీస్ అధికారులతో జూమ్ యాప్ ద్వారా మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 23 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్‌బీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ పవన్ కుమార్‌రెడ్డి, ఎస్ఐ అలీఖాన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

కడియం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జరిగాయి. కడియం ఉన్నత పాఠశాలలో 2002-2003లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, వీరవరం జడ్పీ హైస్కూల్లో 2006-2007లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ కలయిక సోమవారం వేర్వేరుగా జరిగాయి. వివిధ రంగాలు, ఉద్యోగాల్లో స్థిరపడిన మిత్రులంతా కలుసుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి అల్లరి చేష్టలను, మధురానుభూతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మార్ని లలిత, సలాది హారిక, మార్ని సుజాత, అబ్బిరెడ్డి సునీత, మార్ని జ్యోతి, కవికొండల శ్రీను, వనుం శ్రీను, దుప్పలపూడి సుధాకర్ పాల్గొన్నారు.

మార్కెట్లోకి హ్యుండయ్ క్రేటా ఎలక్ట్రిక్ కార్


కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మార్కెట్లోకి హ్యుండయ్ క్రేటా ఎలక్ట్రిక్ కార్ విడుదల చేశారు. స్థానిక సోమవారం లక్ష్మీహుండయ్ షోరూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్‌ను విడుదల చేశారు. కార్ పీచర్స్‌ను షోరూం హెడ్ ఆపరేషన్స్ ఆర్ఎన్‌వీ సునీల్‌కుమార్ వివరించారు. ఈ కార్ ప్రారంభ ధర రూ.17.99 నుంచి రూ23.50 లక్షల వరకు లభ్యమౌతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వీరేష్, రవికుమార్, కోటేశ్వరరావు, దుర్గారావు, సుమంత్, మురళీ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 19 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డ్రైనేజీలు, వీధి దీపాలు, రోడ్లు, ఇంటి పన్నులు తదితర సమస్యలపై అర్జీలొచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇంకా పాత వాసనలే!

- ప్రభుత్వం మారినా పేరు మారలేదు
- రాజానగరంలో వ్యవసాయ కార్యాలయం భవనంపై గత ప్రభుత్వ పథకం పేరు, మాజీ సీఎం ఫొటో


రాజానగరంలో గత సీఎం ఫొటోతో దర్శనమిస్తున్న వ్యవసాయ శాఖ కార్యాలయం

రాజానగరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలన ఛాయల నుంచి కొంతమంది అధికారులు ఇంకా బయటికి రాలేకపోతున్నారు. అప్పటి ప్రభుత్వంపై అభిమానమో లేక ఇప్పటి పాలకులపై నిర్లక్ష్యమో తెలియదుగానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇంకా పాత వాసనలే ఆస్వాదిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాల పేర్లను కూటమి ప్రభుత్వం రైతు సేవ కేంద్రాలుగా మార్చింది. రాజానగరం మండలంలో పలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల భవనంపై అప్పటి పేర్లు, అప్పటి సీఎం జగన్ ఫొటోలు ప్రభుత్వ భవనాల మీద ఇంకా దర్శనమిస్తున్నాయి. ఎక్కడో మారుమూల గ్రామంలో అయితే పట్టించుకోలేదనుకోవచ్చు కానీ మండల కేంద్రమైన రాజానగరంలోని వ్యవ సాయ కార్యాలయం భవనంపై అప్పటి ప్రభుత్వం పేరుతో పాటు మాజీ సీఎం జగన్ ఫొటోలు నేటికీ అలాగే దర్శనమివ్వడం అధికారులకు తీరుకు అద్దం పడుతోంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ఉన్న గత ప్రభుత్వ పథకాల పేర్లను, చిత్రపటాలను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో విద్యార్థులు, యువత రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రవాణా శాఖాధికారులు పేర్కొన్నారు.జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు- 2025లో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని శశి కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐలు సంపత్‌కుమార్, జి.రామ్‌నారాయణ, ఎం.రవికుమార్, ఏఎంవీఐలు పీవీవీడీ.సాయికుమార్, హోంగార్డులు, రోడ్డు భద్రత వైద్యురాలు డాక్టర్ మాధురి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు మేరకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ రాజమహేంద్రవరం నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రిజర్వేషన్లు అట్టడుగు వర్గాలకు పూర్తిగా అమలయ్యేంత వరకూ న్యూడెమాక్రసీ పోరాడుతుందన్నారు. రిజర్వేషన్లలో వర్గీకరణను అమలు చేయాలని, సామాజిక న్యాయాన్ని చేకూర్చాలని డిమాండ్ చేశారు.

డ్రోన్‌తో కషాయాల పిచికారీ

కొవ్వూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు అన్నారు. దొమ్మేరు, పంగిడి గ్రామాల్లో సోమవారం ప్రకృతి వ్యవసాయ వరి క్షేత్రాల్లో కాండం తొలుచు, ఆకు చుట్టు పురుగు నివారణకు 42 ఎకరాల్లో డ్రోన్ ద్వారా కషాయాలను పిచికారీ చేయించారు.

ఏడు నెలల్లో రూ.90 కోట్ల అభివృద్ధి పనులు

- రేపు మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజుకు ఏర్పాట్లు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కమీషన్లు లేకుండా పనులు జరుగుతున్నాయని.. ఏడు నెలల్లో రూ. 90 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నారా లోకేశ్ పదవి విషయమై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉంటామన్నారు. వైసీపీ సైకోలు కూటమి నేతల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని వారి ఆశ అడియాశే అన్నారు. మరో 15 ఏళ్లు కూటమి అధికారంలో ఉండడం ఖాయమన్నారు. లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఎన్‌టీఆర్ ట్రస్ట్, శాంతారామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రియాంక గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవానీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. రూ.25 కోట్లతో రివర్ ఫ్రంట్, రూ.7 కోట్లతో స్టేడియం నిర్మాణానికి టెండర్లు ప్రక్రియ సాగుతుందన్నారు. రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. పేపరుమిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, మజ్జి రాంబాబు, రెడ్డి మణి, బుడ్డిగ రాధ, దాస్యం ప్రసాద్, మాలే విజయలక్ష్మి, కోసూరి చండిప్రియ,కప్పల వెలుగుకుమారి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

రేపు కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ దేశమంతా కార్యక్రమాలు చేస్తోందని, దీనిలో భాగంగా ఈ నెల 22న రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు సెంటర్ గాంధీ విగ్రహం వద్ద నుంచి భారీ ర్యాలీ చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ర్యాలీకి ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ, ముఖ్యనాయకులు హాజరవుతున్నారని చెప్పారు. పార్లమెంట్‌లో అమిత్ షా.. బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కంబాలచెరువు సెంటర్ మహాత్మగాంధీ విగ్రహం నుంచి ప్రారంభమై గోకవరం బస్టాండ్ అంబేడ్కర్‌విగ్రహం వరకు సాగుతుందని, అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ముఖ్యనాయకులు మాట్లాడతారని చెప్పారు. అనంతరం పేపరుమిల్లు వద్ద ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశం ఉంటుందని చెప్పారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎరుకుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు మోహన్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు గ్రామానికి చెందిన ఎస్టీ యువతి లక్ష్మీకాంతంను పెళ్లి పేరుతో వంచించి అడ్డం తొలగించుకోవాలని హత్యాయత్నం చేసిన జాన దివ్యశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌కుమార్ ధర్మా డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రేమిస్తున్నానంటూ దగ్గరై మోసగించాడన్నారు. బాధితురాలు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని చెప్పారు. బాధితురాలు లక్ష్మీకాంతం మాట్లాడుతూ దివ్యశేఖర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీ నాయకులు మత్తి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వృక్షాలకు నిప్పుపై అనుమానాలు


గోకవరం-రాజమహేంద్రవరం రహదారి మధ్యలో భారీ వృక్షానికి నిప్పు పెట్టిన దృశ్యం

గోకవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి ప్రధాన రహదారుల పక్కన వాహనదారులకు నీడనిస్తున్న భారీ వృక్షాలకు రక్షణ కరువైంది. ఒకప్పుడు రోడ్లకు ఇరువైపులా పచ్చదనంతో ఆకట్టుకున్న వృక్షాలు ఇప్పుడు చాలా వరకు కనుమరుగయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరవవ్వడంతో కొంతమంది స్వార్థపరుల ధనదాహానికి తాతల కాలం నాటి చెట్లు రాత్రుళ్లు నేలకూలి, తెల్లవారేసరికి కనిపించడం లేదు. మరికొన్ని చెట్లు ఇటుక బట్టీ వ్యాపారులు, లేఅవుట్ నిర్వాహకుల స్వార్థానికి బలవుతున్నాయి. ముఖ్యంగా ఈఘటనలు ఇటీవల గోకవరం మండలంలో ఎక్కువగా జరుగుతున్నాయి. తాజాగా గోకవరం- రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో (వీరలింకపల్లి సమీపంలో ఉన్న లేఅవుట్ ఎదురుగా) కొద్ది రోజుల క్రితం ఓ భారీ వృక్షం అగ్నికి ఆహుతైంది. అదేవిధంగా గోకవరం- కాకినాడ వెళ్లే ప్రధా రహదారి మధ్యలో కొత్తపల్లి శివారున ఓ ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసుకున్న భవనం ఎదురుగా ఉన్న భారీ వృక్షం కూడా ఇదే తరహాలో కాలి బూడిదైంది. ఈరెండు ఘటనలు యాదృచ్ఛికంగా జరిగాయా లేదా స్వార్థపరులెవరైనా చేసిన పనో తెలియదు గాని రెండు భారీ వృక్షాలు మాత్రం ఎటువంటి ఆనవాళ్లు లేకుండా కాలి బూడిదయ్యాయి.

హరిదాసులను గౌరవించాలి


హరిదాసును సత్కరిస్తున్న సనాతన ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు మోహనరావు, సతీష్

అనపర్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నెల అంతా ప్రతీరోజూ తెల్లవారుజామున హరినామ కీర్తనలు చేసే హరిదాసులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. నెలరోజులు గ్రామసంచారం చేసిన ఇద్దరు హరిదాసులను సోమవారం సమితి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిదులు రెడ్డి రామ్మోహనరావు, రెడ్డి సతీష్ పాల్గొన్నారు

సబ్బుబిళ్లపై గరికిపాటి ముఖచిత్రం


గరికిపాటికి సబ్బుబిళ్లపై చెక్కిన ముఖచిత్రాన్ని అందిస్తున్న శ్రీనివాస్, ఆయన కుమార్తెలు



రంగంపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మహా సహస్రావధాని, పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు ముఖచిత్రాన్ని రంగంపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకతశిల్పి దేవిన శ్రీనివాస్ సబ్బు బిళ్లపై అద్భుతంగా చిత్రీకరించారు. రాజమహేంద్రవరంలో శ్రీసత్యసాయి గురుకులంలో ఆదివారం రాత్రి గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రసంగ వేదికపై సబ్బుబిళ్లపై చెక్కిన ముఖచిత్రాన్ని గరికిపాటికి అందించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌ను గరికిపాటి అభినందించారు. అలాగే శ్రీసత్యసాయి సేవా సంస్థల తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల అధ్యక్షులు బులుసు వెంకటేశ్వర్లు, యార్లగడ్డ గోవిందరాజులు, అడబాల వెంకటేశ్వరరావులు శ్రీనివాస్‌ను, ఆయన కుమార్తెలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి పరామర్శ

ఉండ్రాజవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు గ్రామంలో పలువురిని మంత్రి దుర్గేష్ సోమవారం పరామర్శించారు. గ్రామ ఉపసర్పంచ్ జవ్వాది వీరభద్రం తల్లి అమ్మన్న, టీడీపీ నాయకుడు నిడదవోలు సత్య నారాయణ తల్లి ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను మంత్రి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీతానగరంలో ఉచిత పశువైద్య శిబిరం



సీతానగరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరులో సోమవారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు నట్ల నివారణ మందులు, గర్భకోశ వ్యాధుల చికిత్సలు, మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, జనసేన నాయకులు మట్ట వెంకటేశ్వరరావులు రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డా. ఫణీంద్ర మాట్లాడుతూ వైద్య శిబిరంలో 48మంది రైతులకు చెందిన 72పశువులను, 262గొర్రెలు, మేకలను పరీక్షించి, రైతులకు ఉచితంగా మందులు అందించామన్నారు. కార్యక్రమంలో పీవీకే ఎ.మునేంద్ర, వై.సుధాకర్ ఎం.గీతిక, జి.వెంకటేశులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

బిక్కవోలు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు కాని పిల్లల కోసం ఈనెల21 నుంచి 24 వరకు ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో వి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. 21న ఆరికరేవుల, రంగాపురం, బిక్కవోలు- 1, కొమరిపాలెం- 1, 22న మెళ్లూరు, బలభద్రపురం- 1, బిక్కవోలు- 2, కొమరిపాలెం- 2, 23న కొంకుదురు- 1, బలభద్రపురం- 2, బిక్కవోలు- 3, కాపవరం, 24న కొంకుదురు- 2, ఇళ్లపల్లి, బిక్కవోలు- 4, బలభద్రపురం- 3 గ్రామసచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈప్రత్యేక ఆధార్ క్యాంపులకు సంబంధిత అంగ న్వాడీ టీచర్లు, వీఆర్వోలు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు ఆధార్ నమోదు కాని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి నూరుశాతం నమోదయ్యేలా చూడాలని ఎంపీడీవో సూచించారు.

అభ్యసనా ఫలితాలు వచ్చేలా కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్షా ఏపీసీ సుభాషిణి

దివాన్‌చెరువు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడంతో బాటు ప్రతి విద్యార్థికి తరగతికి సంబంధించిన అభ్యసన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి అన్నారు. కొండగుంటూరులో ఎఫ్ఎల్ఎన్ జ్ఞానప్రకాష్ 8వ స్పెషల్ శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఒత్తిడి లేకుండా ఆట పాటలతో భాష, గణిత నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. బోధన అభ్యసన, నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఈశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి 275మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 80మంది ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారు. వారికి శిక్షణ ఇవ్వడానికి 24మంది డీఆర్పీలు, ముగ్గురు కెఆర్పీలు పాల్గొన్నారు. ఏఎంవో డి.గౌరీశంకర్రావు, ఐఈ కోఆర్డినేటర్ ఎన్.కనకబాబు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ ఎస్తేరురాణి, ఎంఈవోలు జ్యోతిప్రసాదు, మధుసూదనరావు, ప్రథమ్‌జిల్లా కోఆర్డినేటర్ అనూష పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


లక్ష్మీనరసింహస్వామి పాదాలను పసుపునీటితో శుద్ధి చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, వైసీపీ నాయకులు

కోరుకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన అపచారంపై ప్రభుత్వం, అధికారులు తక్షణం స్పందించి నిందితులను శిక్షించాలని వైసీపీ కేంద్ర కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. మద్యం బాటిల్స్ మాంసం ఆలయ ఆవరణలో ఉన్నాయని సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయన్నారు. సోమవారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి స్వామి వారి పాదాలకు ఆమె అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించకూడదన్నారు. తన కుమారుడు జక్కంపూడి రాజా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వాతావరణం తీసుకురావాలనే ఉద్దేశంతో 117ఆలయాకు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేయించారన్నారు. ఆలయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, నక్కా రాంబాబు, గణేశుల పోసియ్య, కొండపల్లి దుర్గారావు, తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి, కంటే వినయ్ తేజ, బొండాడ చందు, నీరుకొండ బాబ్జి, పసుపులేటి బుల్లియ్యనాయుడు, కోడూరి సత్తిరెడ్డి, కటకం బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల అందజేత

గోకవరం, జనవరి20(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ పురంశెట్టి శివాజీ, ఎంపీటీసీ సభ్యుడు చెన్నంశెట్టి చక్రరావు ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తనయుడు జ్యోతుల అనీష్ నెహ్రూ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆదివారం రాత్రి విజేతలకు అనీష్ నెహ్రూ బహుమతులు అందజేశారు.

31నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దివాన్‌చెరువు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని డీబీవీ రాజు టౌన్‌షిప్‌లో కొలువైఉన్న శ్రీభూసమేత, అలివేలుమంగ పద్మావతి గోదా అండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు సోమవారం తెలిపారు. ఈఉత్సవాలు ఐదురోజులు ఫిబ్రవరి 4 వరకు జరుగుతాయన్నారు. తొలిరోజు ఈనెల31న దీక్షాధారణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఫిబ్రవరి 1న ఉదయం మహాపూర్ణాభిషేకం, సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం, 2న ఉదయం లక్ష్మీ అమ్మవారికి మహాపూర్ణాభిషేకం, పద్మపుష్పాలతో అర్చన జరుగుతాయన్నారు. ఉత్సవాలు జరిగే ఐదురోజులు ఉదయం, సాయంత్రం జరిగే కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు



అనపర్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వై.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షెడ్యూల్‌ను వివరించారు. ఈనెల 21న పీరారామచంద్రపురంలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తామన్నారు. 22న దుప్పలపూడి, 23నకొప్పవరం, 24న లక్ష్మీనరసాపురం, 25న మహేంద్రవాడ, 27న రామవరం, 28నపెడపర్తి, 29న కుతుకులూరు, 30న పులగుర్త, 31న పొలమూరు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. నట్టల నివారణ, గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తామన్నారు. పాడి రైతులు ఈశిబిరాలను వినియోగించుకోవాలన్నారు.

ఉండ్రాజవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఉండ్రాజవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధ దమ్మ పీఠంలో రాజమహేంద్రవరానికి చెందిన పరమహంసయోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 88మంది రోగులకు వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 14మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక కాగా, 30మందికి కళ్లజోళ్లు వేసేందుకు వైద్యులు నిర్ణయించారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు.



అక్రమంగా కట్టేయ్! అడిగేదెవరు!



ఇలా వదిలేశారే : నిడదవోలు మునిసిపాలిటీలో మెయిన్‌రోడ్డుపై సెల్లార్ లేకుండా నిర్మించిన భవనం

జిల్లాలో యథేచ్ఛగా అక్రమ భవన నిర్మాణాలు

- డబ్బులిచ్చుకో..కట్టుకో
- పట్టణాల్లో వందల భవనాలు
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తే కారణం
- నాయకులతో సిఫారసులు
- కూటమి వచ్చినా ఆగని వైనం
- జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు
- క్రమబద్ధీకరణపై ఆశలు

రాజమహేంద్రవరం సిటీ/నిడదవోలు/కొవ్వూరు జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :డబ్బులివ్వండి.. భవనాలు ఇష్టానుసారం కట్టుకోండి అనేలా ఉంది టౌన్ ప్లానింగ్ అధికారులతీరు.. మామూళ్ల మత్తులో జోగుతా అక్రమ నిర్మాణాలను వదిలేస్తున్నారు. వ్యాపార భవన సముదాయమైనా.. గృహ నిర్మాణమైనా అనుమ తుల్లేకపోయినా నిర్మించుకోవచ్చు.ఇలా జరగాలంటే అధికారులకు మామూళ్లు అందిస్తే చాలు. అక్రమ భవన నిర్మాణాల వంక కన్నెత్తి చూసే అధికారులు ఉండరు.ఇలాంటి నిర్మాణాల మీద ఫిర్యాదులు వస్తే మాత్రం సంబంధిత అధికా రులు తమ ఉద్యోగ భద్రత కోసం ఆ భవన నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చి సరిపెట్టేస్తారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అక్రమ,నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవన నిర్మాణాలపై కోర్టుకు వెళ్లరు ఇదంతా మామూళ్ల మహిమ.దీంతో జిల్లాలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.

క్రమబద్ధీకరిస్తారనే ఆశలో..

కూటమి ప్రభుత్వ ఖచ్చితంగా అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరిస్తుందనే ధీమాలో యజమానులు ఉన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.700 కోట్లు ఆదాయం వచ్చేలా చేసింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా రెగ్యులర్ చేస్తుందనే నమ్మకంలో అక్రమ నిర్మాణదారులు ఉన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మునిసిపల్ మంత్రి నారాయణ కూడా ప్లానుకు మించి అదనపు శ్లాబ్ నిర్మాణాలు చేసిన వాటిని నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.దీంతో నిర్మాణదారులకు భయం పోయింది.కొంత మంది అక్రమార్కులు దీనిని వెసులుబాటుగా చేసుకునేందుకు రేయింబవళ్ళు నిర్మాణాలు చేస్తున్నట్టు తెలిసింది.ఏడాది కిందట నిర్మించుకున్నవాటిని పునఃపరిశీలన చేశాక మాత్రమే క్రమబద్ధీకరిస్తారు. భవనాల క్రమబద్ధీకరణ జరిగితే ఒక్క రాజమహేంద్రవరం నుంచే సుమారు రూ.20 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉంది. అయితే రూల్స్‌ను మరింతగా బ్రేక్ చేసి చీట్ చేసిన వాటిని మాత్రం క్రమబద్ధీకరించే అవకాశాలు లేవు.



రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో అక్రమ భవన నిర్మాణం

రాజమహేంద్రవరంలో 100కి పైగా

జిల్లా అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది..అనుమతులు లేకుండా భారీ భవంతులు కట్టేస్తున్నారు.గత ఐదేళ్లగా పరిస్థితి మితిమీరింది. ప్రస్తుతానికి అదే కొనసాగుతోంది.అయినా అడిగే నాథుడే కనిపించడం లేదు. రాజమహేంద్రవరం లో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మించారు.గతంలో సుమారు 100 భవనాలకు అధికారులు నోటీసులిచ్చినట్టు తెలిసింది.వాటి సంగతి తేలకముందే మరొక 50 పైబడి భవనాలు పుట్టుకొచ్చాయి. గత ప్రభుత్వం చివర రోజుల్లో వైసీపీ నాయకుడొకరు అప్పటి సీఎం అండతో భారీగా వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. అక్రమ భవనాల మాటున అధికారులకు లక్షలాది రూపాయలు అందాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రాజమహేంద్రవరంలో నిబంధనలు అతిక్రమించి సుమారు 100కి పైబడి ఉన్నట్టు సమాచారం. 400 చదరపు అడుగులకు అనుమతి తీసుకుంటే శ్లాబ్‌లు 600 చదరపు అడుగులు నిర్మించారు. రెండు ఫ్లోర్లకు అనుమతులు తీసుకుని నాలుగు ఫ్లోర్లు నిర్మాణాలు చేశారు. 90 శాతం గత ప్రభుత్వ హయాంలో జరగ్గా...ఈ ఆరునెలలో 10 శాతం నిర్మాణాలు జరిగాయి.రాజమహేంద్రవరంలో అక్రమ భవన నిర్మాణాల సమస్య రాష్ట్ర విజిలెన్స్ డీజీ దృష్టికి వెళ్లినట్టు తెలిసింది.నగరానికి చెందిన ఒక వ్యక్తి విజిలెన్స్ డీజీకి ఫిర్యాదు చేయడంతో సమస్యపై ఆరా తీసింది.దీనిపై యాక్షన్‌లోకి వెళ్లే అవకాశం ఉంది.

నిడదవోలులో ఇలా..

నిడదవోలు పురపాలక సంఘం గత ఐదేళ్ల అక్రమ భవన నిర్మాణాలకు అడ్డాగా మారిపోయింది.గత వైసీపీ పాలన నుంచి నేటి వరకు నిబంధనల ఊసేలేదు. ఒక పక్క అధికారులకు మామూళ్లు..మరోపక్క సిఫార్సులతో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సాక్షాత్తు పట్టణ పరిధిలోని సచివాలయానికి ఎదురుగా నిర్మించిన నివాస గృహాల సముదాయంలో అనుమతులకు విరుద్ధంగా కమర్షియల్ షాపులు నిర్మించినా అధికార్లు అటువైపు కన్నెత్త యినా చూడలేదు. పట్టణ పరిధిలో గత ఐదు న్నరేళ్లలో సుమారు వందకు పైగా అక్రమ భవన నిర్మాణాలు ఉన్నాయి. పట్టణంలోని గణ పతి సెంటరుకు అతిసమీపంలో గతేడాది నిర్మించిన వాణిజ్య భవన నిర్మాణంలో నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాన్ని వదలకుండా నిర్మించేశారు.ప్రధాన రహదారిపై ఈ భవన నిర్మాణం కనిపిస్తున్నా అధికారుల్లో చలనం లేదు.కారణం అధికారులకు భారీగానే తాయిలాలు అందినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇలాంటి భవన నిర్మాణాలు పట్టణంలో ఎన్నో ఉన్నాయి.నిడదవోలు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.సుప్రియను ప్రశ్నించగా 2024 సంవత్సరానికి అక్రమ,నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు 23 గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు.

కొవ్వూరులోనూ ఇంతే..

కొవ్వూరు పట్టణంలోనూ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. సుమారు 30 నుంచి 50 వరకూ అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు అధికారులు నోటీసులు జారీ చేసినట్టు చెబుతున్నారు. మిగలిన భవనాలు పరిశీలిస్తామన్నారు.



రాజమహేంద్రవరంలో పోలీస్ పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న డీజీపీ ద్వారకాతిరుమలరావు, చిత్రంలో ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ నరసింహకిశోర్..ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కను నాటుతున్న డీజీపీ

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

పోలీస్ పెట్రోల్ బంక్ ప్రారంభంలో డీజీపీ ద్వారకాతిరుమలరావు

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు అన్నారు. రాజమహేంద్రవరం పోలీస్ క్వార్టర్స్ శ్రీరాంపురం రహదారిలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఐవోసీఎల్ ఏర్పాటు చేసిన పోలీస్ పెట్రోల్ బంక్‌ను సోమవారం ప్రారంభించారు.ఇప్పటికే ఒక పెట్రోల్ బంకును నిర్వహిస్తున్న పోలీస్ శాఖ రాజమహేంద్రవరంలోనే రెండో బంక్ ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ద్వారకాతిరుమలరావుకు తొలుత ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ. అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహకిశోర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ప్రారంభించారు.ఆర్టీసీ డిపోను పరిశీలించి ఒక మొక్క నాటారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు.త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. ఆయన వెంట ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్బాం, ఏటీఎం కమర్షియల్ మాధవ్,అడిషనల్ ఎస్పీలు (అడ్మిన్) ఎన్‌బీ ఎం.మురళీకృష్ణ, (లా అండ్‌ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు, (క్రైమ్స్) ఎల్.అర్జున్, (ఏఆర్) చెంచిరెడ్డి, డీఎ స్పీలు ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

2,3న మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశాలు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరుగుతాయని మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ పి.లావణ్య వెల్లడించారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సొంతింటి కల నెరవేరుస్తామని ఇళ్లలేని పేదలు, మధ్యతరగతి వారికి గూడు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఆ హామీలు నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు సేపేని రమణమ్మ, యడ్ల లక్ష్మి, శెట్టి నాగమణి, బేగం పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎస్‌వోగా నాగాంజనేయులు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ డీఎస్‌వో నాగాంజనేయులును నియమించి సోమవారమే బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో గల రైస్ మిల్లుకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించడంలో డీఎస్‌వో ప్రసాద్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు సమాచారం. అంతే కాకుండా మంత్రి నాదెండ్ల మనోహర్ రైస్ మిల్లు తనిఖీకి వచ్చినపుడు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదితర కారణాలతో గత డీఎస్‌వో ప్రసాద్‌ను తప్పించినట్టు తెలిసింది.ప్రసాద్‌పై మిల్లర్ల అసోసియేషన్ పలు మార్లు ఫిర్యాదు చేసింది. ఈ మేర కు డీఎస్‌వో ప్రసాద్‌ను రిలీవ్ చేస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

ఇసుగేస్తోంది!



గందరగోళంగా ఇసుక విధానం

- ఉచిత ఇసుకతో ఇబ్బంది
- గోదావరి నిండా ఇసుక
- ఓపెన్ కాని ర్యాంపులు
- అంతుపట్టని అధికారుల వైఖరి
- ర్యాంపులపై ప్రచారమే..
- కేటాయింపులు శూన్యం
- అతి చేస్తున్న అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఉచిత ఇసుక అమలు విధానం ఆది నుంచి గందరగోళంగానే ఉంది. మధ్యలో కొద్ది రోజులు బాగానే నడిచినా తిరిగి మామూలైపోయింది. ఎక్కడ ఏం జరుగుతుందో కానీ జిల్లాలో గోదావరి నిండా ఇసుక ఉన్నా దానిని వెలికితీసి సరఫరా చేసే విధానాల్లో సరైన పద్ధతి అవలంభించడంలేదు.ఈ పాటికే జిల్లాలోని అన్ని ర్యాంపులు తెరిచి ఉంటే స్టాక్ పాయింట్లలో ఇసుక కొండలు మాదిరిగా ఉండేది.అన్ని ర్యాంపులకు అనుమతులివ్వక పోవడం.. కొన్ని ర్యాంపులకు అనుమతిచ్చినా వాటిని కొనసాగించే పరిస్థితులు లేకపోవడంతో ఇసుక విషయం పెద్ద రచ్చగా మారింది. దీంతో ప్రజా ప్రతినిధులు ,అధికారులు బ్యాడ్ అవుతున్నారు.

ర్యాంపులున్నా..ఏం లాభం

జిల్లాలో అఖండ గోదావరి ఉంది. బ్యారేజీ దిగువన ర్యాంపులు ఉన్నాయి.గోదావరిలో తరగనంత నాణ్యమైన ఇసుక ఉంది. సీతానగరం మండలం, రాజమండ్రి రూరల్ మండలం, తాళ్లపూడి మండ లం, పెరవలి, నిడదవోలు మండలాలపరిధిలో అనేక ఓపెన్ రీచ్‌లకు అనుమతి ఇవ్వొచ్చు.పట్టా భూములు, జిరాయితీ భూముల్లో కూడా అనుమతులు ఇవ్వొచ్చు. కానీ క్షేత్రస్థాయిలో ర్యాంపులు అందుబాటులోకి రావడంలేదు.అనుమతి పొందిన ర్యాంపులు ఓపెన్ కావడంలేదు. జిల్లాలో సుమారు 100కు పైగా బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతిచ్చినట్టు గతంలో అధికారులు ప్రకటించారు. పనిచేయని సొసైటీలపై చర్యలు తీసుకుంటామని సాక్షాత్తూ కలెక్టర్ ప్రకటించారు. బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతిస్తూ కేటాయించిన ఇసుక తీత పూర్తయిన వెంటనే మరిన్ని కేటాయింపులు ఇవ్వాల్సి ఉంది.అక్కడా జాప్యమే జరుగుతోంది. కొవ్వూరు మండలంలోని వాడపల్లి, ఔరంగాబాద్ వంటి బోట్స్‌మన్ సొసైటీలకు ఇప్పటికీ తిరిగి కేటాయింపులు జరపలేదు. గాయత్రికి కేటాయించినా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. కొవ్వూరు వైపు కొన్ని, కోటిలింగాల ర్యాంపులు మాత్రం పనిచేస్తున్నాయి.ఎక్కడా ఇసుక లేకపోవడంతో రాత్రి సమయంలో గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్ చేసేస్తున్నారు.

సమస్యలు..ఓపెన్?

సీతానగరం, పెరవలి తదితర ప్రాంతాల్లో టెండర్లు పిలిచి కొన్ని ర్యాంపులకు అనుమతిచ్చారు. అవి ఇప్పటికీ ప్రారంభం కాలేదు. వేమగిరి ర్యాంపు పనిచేయడంలేదు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరగడంతో వంగలపూడి 1,2, జీడిగుంట ర్యాంపుల్లో కాంట్రాక్టర్ల ఒప్పందాన్ని రద్దు చేసి కొత్తవారికి ఇచ్చారు. అయినా తిరిగి ప్రారంభం కాలేదు. పెరవలి, నిడదవోలు మండలాల్లో కూలి రేటుకు పట్టుపట్టడంతో అక్కడ ర్యాంపులన్నీ ఆగిపోయాయి. కాతేరులో ర్యాంపులకు అనుమతి లేదు. మరో 10 ఓపెన్ రీచ్‌లకు, ఆరు సెమీ మెకనైజ్డ్ బోట్లకు త్వరలో అనుమతివ్వనున్నామని, మరో 77 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని చాలా రోజులుగా ప్రకటిస్తున్నారు. కానీ ఇంత వరకూ అమలుకాలేదు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లు క్రమం తప్పకుండానే జరుగుతున్నాయి. కానీ కమిటీలో తీసుకున్న నిర్ణయాలు అమలు జరగడం లేదు.

మాటలే.. చేతల్లేవ్..

జిల్లాలో 9 ఓపెన్ రీచ్‌ల వద్ద 5,51,00 మెట్రిక్ టన్నుల ఇసుక, 10 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద 5,37,018 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని సోమవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ప్రకటించారు. అయితే జిల్లాలో 9 ఓపెన్ రీచ్‌లలో ఒక్కటీ పనిచేయడం లేదు. సెమీ మెకనైజ్డ్ ఓపెన్ రీచ్‌లకు పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.నిడదవోలు మండలం పురుషోత్తపల్లి ర్యాంపునకు వచ్చే నెల 10న, కొవ్వూరు ఆరికరేవులకు 11న,తాడిపూడి ర్యాంపు, ప్రక్కిలంక రీచ్‌లకు 12,పెండ్యాల, చిడిపి, సింగవరం ర్యాంపులకు 13న బహిరంగ వేలం నిర్వ హించనున్నారు.వేమగిరి-ఎ,తీపర్రు-ఎ,బీ, జీడిగుంట -ఎ,బీలు, వందలపర్రుల్లో మెకనైజ్డ్ బోట్ల అనుమతికి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు.

కూటమిలోనూ ఆర్కే కుంపటి?

వైసీపీ ప్రభుత్వం హయాంలోనే గుత్తగా ఇసుక వ్యాపారం చేసిన ఆర్కే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా ఇసుకను ఎక్కువ ధరకు విక్రయించడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

రాజానగరం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అధికారులు బాధ్యతగా పనిచేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. రాజానగరం మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలుల్లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు జిల్లా కలెక్టర్ హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. మండలస్థాయి అధికారులు పూర్తిగా గ్రామ సచివాలయ సిబ్బందిపై ఆధారపడిపోయారని ఈ విధానం సరైంది కాదన్నారు. మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శనలు చేయడం లేనట్టుగా తమ పరిశీలనలో వెలుగుచూస్తున్నాయన్నారు. ప్రధానంగా కొన్ని గ్రామాల్లో తరచూ ఫిర్యాదులు వస్తున్నాయంటే అక్కడ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని అవగతమవుతుందన్నారు. ప్రజలు అధికారులు పనితీరు గమనిస్తూ ఉంటారన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు ఇష్టానుసారం తవ్వితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం మండల వ్యాప్తంగా అర్జీలను కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు స్వీకరించారు. ప్రధానంగా రాజానగరం మండలం నందరాడలోని అడుసుమిల్లి వెంకయ్య చెరువు (ఏవీ ట్యాంకు)లో నీరు దిగువ ప్రాంతానికి పోకుండా కొంత మంది స్వార్థపరులు అడ్డుకట్ట వేస్తున్నారని, దీంతో ఎగువ భాగం నరేం ద్రపురంలో దాదాపు 130 ఎకరాల్లోని పంట పొలాలు ముంపు నకు గురవు తున్నాయంటూ బాధిత రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల భూములకు సంబంధించి వస్తున్న ఎఫ్‌లైన్ పిటిషన్లను ఎందుకు పెండింగ్ పెడుతున్నారంటూ మండల సర్వేయర్ అనితను నిలదీశారు. ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయిన బాధితులకు నష్ట పరిహారం ఇప్పించాలంటూ కొంతమంది బాధితులు వినతిపత్రం అందజేశారు. నందరాడ సొసైటీలో అవకతవకలపై ఫిర్యాదు చేస్తే తనకు తెలియకుండా విచారణ పూర్తి చేశారని అడబాల గణపతిరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైతుల భూ సమస్యలకు సంబంధించి పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రతి సోమవారం మండలస్థాయిలో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు ఎన్ని అర్జీలు వస్తు న్నాయంటూ తహసీల్దార్ జీపీఎల్‌ఎస్ దేవిని ఆరా తీశారు.కార్యక్రమంలో జేసీ చినరాముడు, డీఎల్‌డీవో వీణాదేవి,తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, ఎంపీడీవో జేపీ ఝాన్సీ, ఎంపీపీ సీతారత్నం పాల్గొన్నారు.



రాజానగరం మండల పీజీఆర్‌ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

సీతారాంపురం కార్యదర్శికి షోకాజ్

సీతారాంపురం పంచాయతీ కార్యదర్శి పని తీరు సక్రమంగా లేదని సర్పంచ్ బొబ్బర వరహాలు ఫిర్యాదు చేశారు. దీంతో కార్యదర్శి డి.ధనలక్ష్మిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేయకపోతే వెళ్లిపోండి, ఎంత కాలం నుంచి చేస్తున్నారు? నిధులు లేవని చెప్పడానికి వీల్లేదంటూ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీకి ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులకు సెలవులు ఇవ్వొద్దని, ఈవోపీఆర్డీ ఎన్ని విజిట్లు చేయాలంటూ ఈవోఆర్డీని వాణిని ప్రశ్నించారు.

కలెక్టరేట్‌లో 100 వినతులు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 20 (అంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి డీఆర్‌వో టి.సీతారామమూర్తి అర్జీలు స్వీకరించారు. 96 ఆఫ్‌లైన్ కాగా నాలుగు ఆన్‌లైన్‌లో స్వీకరించారు. గణేష్ చౌక్ రైతు బజార్‌లో బినామీ రైతు పంతగాని సతీష్ మరికొంత మంది గత 20 ఏళ్లుగా వ్యాపారం చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని బేతాల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. వేమగిరికి చెందిన చలపతి రోహిణి తన భర్త సూరిబాబుకు యూనియన్ బ్యాంక్ చెల్లించాల్సిన బీమా పరిహారం చెల్లించడంలేదని విన్నవించారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం సొసైటీ ఉద్యోగులు ధర్నా చేశారు. యూనియన్ పిలుపు మేరకు ధర్నా చేసినట్టు యూనియన్ నాయకులు తోట వెంకటరామయ్య,కెవివి సత్యనారాయణ తెలిపారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీజీఆర్‌ఎస్‌లో అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల నుంచి సుమారు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

మావయ్యను ఇంటి తీసుకెళుతూ మృత్యు ఒడికి 8

ఏసీబీ కేసులో పోర్టు ఆఫీసర్‌కు రెండేళ్ల జైలు

కొవ్వూరు నుంచి మహా కుంభమేళాకు బస్సు



కుంభమేళా బస్సు యాత్ర వివరాలు తెలుపుతున్న ఆర్టీసీ డీఎం కుమార్

కొవ్వూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నుంచి మహా కుంభమేళాకు 7 రోజుల యాత్ర బస్సు సర్వీసును నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఈ యాత్ర ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమవుతుందన్నారు. యాత్రికులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో కలిపి మనిషికి రూ.10 వేలు టిక్కెట్ ధరగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఈ యాత్రలో భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగరాజ్(ఒక రోజు బస), కుంభమేళా, వారణాసి (ఒక రోజు బస), గయ (పిండ ప్రధానం మానవ జన్మకు సార్థకం), బుద్ధగయ, అరసవిల్లి, శ్రీ కూర్మం, త్రివేణి సంగమ స్నానం, విశ్వనాథ దర్శనం చేయిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సూర్యచంద్రరావు 7382907952, రామకృష్ణ 812 1582849 నంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

ఉండ్రాజవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధ దమ్మపీఠంలో రాజమండ్రికి చెందిన పరమహంసయోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 88మంది రోగులకు వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 14మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక కాగా, 30మందికి కళ్లజోళ్లు వేసేందుకు వైద్యులు నిర్ణయించారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి అనాలయో మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందులు, శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తారని చెప్పారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి నామమాత్రపు రుసుముతో పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. ప్రతి నెలా మూడో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరంతోపాటు దంత పరీక్షలు నిర్వహిస్తారని రోగులు సద్వినియోగం చేసుకోవాలని అనాలయో కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కే కరీమ్, వైద్య సిబ్బంది సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో నాణ్యమైన దిగుబడులు



డ్రోన్‌తో కషాయాల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొవ్వూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు, పంగిడి గ్రామాల్లో వరి పండించే ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో కాండం తొలుచు పురుగు, ఆకు చుట్టు పురుగు నివారణకు అగ్నాస్త్రం, పాల ఇంగువా కషాయాలను 26 మంది రైతులతో 42 ఎకరాల్లో డ్రోన్ ద్వారా సోమవారం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ సంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి రైతులు వినియోగించుకుంటే సాగులో ఖర్చులు తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగ కార్యనిర్వాహక అధికారి వరలక్ష్మి, మాస్టర్ ట్రైనీ మహారాణి, డీఎంఎంటీ ధర్మరాజు, నాగలక్ష్మి, యూనిట్ ఇంచార్జిలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మావయ్యను ఇంటికి తీసుకెళ్తూ మృత్యుఒడికి..

బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు.. ప్రమాదంలో మేనమామ, మేనల్లుడు మృతి



రోడ్డు ప్రమాదం ప్రదేశంలో పడి ఉన్న ప్రసాద్, సాయి కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తన మావయ్యను ఇంటి వద్ద దింపడానికి బైక్‌పై బయలుదేరిన యువకుడు తన మామతో పాటు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వర్‌నగర్‌కు చెందిన మేడిశెట్టి ప్రసాద్ (53) అంబేడ్కర్ వాది. అతడు ఆదివారం పంగిడిలో జరిగిన ఎయిమ్ సమావేశానికి వెళ్లాడు. సమావేశం అనంతరం వేరొకరి కారులో రాత్రి 10గంటలు దాటాక రాజమహేంద్రవరం దానవాయిపేటలో నివాసం ఉంటున్న అతని మేనల్లుడు నక్క సాయికృష్ణ (23) వద్దకు వచ్చాడు.విజయవాడకు చెందిన సాయికృష్ణ రాజమహేంద్రవరంలోని మెడికల్ కంపెనీలో మూడేళ్లుగా పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ప్రసాద్ అతడి వద్దకు వచ్చి తనను లాలాచెరువులోని ఇంటి వద్ద దింపాలని అడిగారు. దీంతో తెలిసిన వ్యక్తి వద్ద బైక్ తీసుకుని నెహ్రూ నగర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల సెంటర్‌కు చేరుకుని రోడ్డు దాటుతుండగా ఆటో వస్తుందని డివైడర్ వద్దకు వచ్చి ఆగారు. ఇంతలో లాలాచెరువు వైపు నుంచి వస్తున్న కాకినాడ-హైదరాబాద్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గమనించకుండా వేగంగా వచ్చి వీరి బైక్ వెనుక భాగంలో బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బస్సును నిలుపుదల చేసి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరి పరిస్థితి విషమించి గంటల తేడాలో మృతిచెందారు. కాగా మేడిశెట్టి ప్రసాద్ ఆటోనగర్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయికృష్ణకు తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబానికి అతడే దిక్కు.ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీ కేసులో పోర్టు అధికారికి రెండేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో గతంలో పోర్టు ఆఫీసర్‌గా పనిచేసిన మనం వెంకట కృష్ణమోహన్‌కు రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు రెండేళ్ల జైలు శిక్షవిధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఐ.సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ సాంబమూర్తి నగర్‌కు చెందిన షేక్ అహ్మద్ అలీషాకు కాకినాడ పోర్టు ఏరియాలో స్థలాన్ని కేటాయించి బార్జి మరమ్మతుల కోసం అనుమతిని జారీ చేసేందుకు మనం వెంకట కృష్ణమోహన్ 2009 జూన్ 15న రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు ట్రాప్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో కృష్ణమోహన్ నేరం చేసినట్టు రుజువుకావడంతో రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ 7 ప్రకారం ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమాన, యూ/ఎస్ 13(1)(డి) అవినీతి నిరోధక చట్టం ప్రకారం 2 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయబడతాయని తెలిపారు. ఈ కేసులో పీపీ ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు. కేసును ప్రస్తుత డీఎస్పీ దర్యాప్తు చేశారు. ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ(ఏసీబీ) వి.సుబ్బరాజు, డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై
మాజీ ఎంపీ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీటీడీ పాలక మండలి, ఈవో, జేఈవో లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం స్టేషన్‌కు వెళ్లిన ఆయన తన ఫిర్యాదును పోలీసులకు అందించి రసీదు పొందారు. తొక్కిసలాటలో ఆరుగురు మరణానికి కారకులుగా టీటీడీ చైర్మన్, ఈవో, జేఈవోపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో విద్యార్థులు, యువత రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రవాణా శాఖాధికారులు పేర్కొన్నారు.జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు- 2025లో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని శశి కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐలు సంపత్‌కుమార్, జి.రామ్‌నారాయణ, ఎం.రవికుమార్, ఏఎంవీఐలు వీవీవీ డీ.సాయికుమార్, హోంగార్డులు, రోడ్డు భద్రత వైద్యురాలు డాక్టర్ మాధురి పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా జీవించాలి

» మంత్రి కందుల దుర్గేష్
» నిడదవోలులో కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ
» గోపవరంలో సంక్రాంతి సంబరాల విజేతలకు బహుమతుల ప్రదానం



గోపవరంలో విజేతలకు బహుమతి అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో అందరూ కులమతాలకు అతీతంగా కలసి జీవించాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ ముఖచిత్రంతో ముద్రించిన డైరీని ఆయన ఆవిష్కరించారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలనకు కేవీపీఎస్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని మంత్రి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు, దయామణి, జనసేన నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, గోపీయాదవ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నిడదవోలు మండలం గోపవరంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, టీడీపీ నాయకుడు ఆరేపల్లి చిన నంగాలు ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. దీనికి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందించారు. యువత చదువుతోపాటు క్రీడల్లోను ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూరగుపల్లి శేషా రావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగల సూర్యా రావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జమిందార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పంచదార దుర్గాప్రసాద్, జుజ్జవరపు గోపి, ఆరేపల్లి దుర్గాశ్రీను, కోయి రమేష్, పంచదార చినవెంకన్న, అడ్డగర్ల వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ

ఉండ్రాజవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు గ్రామంలో పలువురిని మంత్రి దుర్గేష్ సోమవారం పరామర్శించారు. గ్రామ ఉపసర్పంచ్ జవ్వాది వీరభద్రం తల్లి అమ్మన్న, టీడీపీ నాయకుడు నిడదవోలు సత్యనారాయణ తల్లి ఇటీవల మృతిచెందారు. దీంతో వారి కుటుంబాలను మంత్రి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కరుటూరి నరేంద్ర బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు మేరకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎంసీపీసీతో కేసుల
సత్వర పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ(ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారమయ్యే అవకాశం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు డీఎల్ఎస్ఏ మందిరంలో సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని జ్యుడీషియల్ అధికారులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వ కాన్సెప్ట్ అండ్ టెక్నిక్‌లపై శిక్షణ నిర్వహించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 24వరకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఎంసీపీసీ యాక్ట్ ప్రకారం 2023 ప్రొవిజన్ ప్రకారం జ్యూడిషియల్ అధికారులు, న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. హైకోర్టు సూచనల మేరకు జ్యూడిషియల్ అధికారులు, న్యాయవాదులను నామినేట్ చేసి కేసులను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. శిక్షణలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయిత్రిదేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, సీనియర్ శిక్షకులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
» తాళ్లపూడిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
» 33 అర్జీలు స్వీకరణ



తాళ్లపూడిలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన పరిష్కారం సత్వరం చూపాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఆయన విచ్చేసి ప్రజల వద్ద నుంచి 33 అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తాళ్లపూడిలోని కుకునూరు శివాలయం వద్ద గోదావరి మంచినీటి పైపులైను వేయాలని చేబోలు రమేష్ కోరారు. పెద్దేవం నుంచి సుగంధి చెరువు అభివృద్ధి చేయాలని, అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్య కోర్టు వద్దకు వెళ్లి పంచాయతీకి వచ్చే ఆదాయం కోల్పోయామని బోడపాటి కాశీ, నామన బులిరాజు, జమ్ముల శ్రీను అర్జీని అందించారు. పైడిమెట్ట ఎత్తిపోతల పథకం కాలువ గట్టుపై ఆక్రమణలను తొలగించాలని దేవరపల్లి రవి పేర్కొన్నారు. కుకునూరు బీసీ కాలనీలో మంచి నీటి ట్యాంకుకు గోదావరి జలాలను సరఫరా చేయాలని గతంలో అర్జీ పెట్టుకున్నామని, ఇప్పటి వరకూ సమస్య పరిష్కారం అవ్వలేదని కలిశెట్టి సన్యాసినాయుడు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం మండలానికి చెందిన పడాల నాగసతీష్, చిట్టాల నాగ సత్యనారాయణ లకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సాయాన్ని ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు నామన పరమేశ్వరరావు, ఇండుగుల రామకృష్ణ, ఎంపీడీవో వెంకటరమణ, డీటీ భారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 9 అర్జీలు



కొవ్వూరులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్‌స్థాయి పీజీఆర్ఎస్‌లో పలువురి నుంచి 9 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందించి త్వరగా సమస్యలు పరిష్కరించి సత్వర న్యాయం అందజేయాలన్నారు. అర్జీదారులు వ్యయ ప్రయాసలు పడి ఆర్డీవో కార్యాలయం వరకు రానవసరం లేదని తహశీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం, కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో రెండేసి చొప్పున ఫిర్యాదులు స్వీకరించినట్టు మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు.

పెరవలి తహశీల్దార్ కార్యాలయంలో..

పెరవలి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భూమి మ్యూటేషన్ కోరుతూ ఒకటి, సర్వే నిమిత్తం మరో అర్జీ వచ్చినట్టు తహశీల్దార్ అచ్యుతకుమారి తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



పెరవలిలో అర్జీ పరిశీలిస్తున్న తహశీల్దార్ అచ్యుతకుమారి

పశువులకు టీకాలు తప్పనిసరి

» వెటర్నరీ ఇన్‌చార్జి ఏడీఏ శామ్యూల్
» మారెళ్లమూడి, కాపవరంలో పశు వైద్య శిబిరాలు



మారెళ్లమూడిలో రైతులకు పథకాలపై అవగాహన కలిగిస్తున్న ఏడీఏ

నల్లజర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ ఇన్‌చార్జి ఏడీఏ శామ్యూల్ రైతులకు సూచించారు. సోమవారం మారెళ్లమూడిలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు అందించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో పశువులు బరువు పెరిగి ఆరోగ్యంగా ఉండడంతో పాటు పాల ఉత్పత్తి పెరగడం, పునరుత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. మినీ గోకులం షెడ్లు, బహుళ వార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశు బీమా, పశు కిసాన్ క్రిడెట్‌కార్డులు, సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు, లింగ నిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. డీవార్మింగ్ బాటిల్స్, కాల్షియం పౌడర్, పౌల్ట్రీ వ్యాక్సిన్ పౌడర్ అందజేశారు. కార్యక్రమంలో బి.రాజు, నవీన్ రైతులు పాల్గొన్నారు.



కాపవరంలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

పెరవలి: మండలంలోని కాపవరంలో పశువైద్య శిబిరం నిర్వహించి 36 పశువులకు చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ చరణ్ ఫణీంద్ర మాట్లాడుతూ ఈ నెల 31 వరకు ప్రతి గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహించి, గర్భకోశ వ్యాధులకు చికిత్సతోపాటు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుపుతామని, పశువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నాజీ, ఎంపీటీసీ ఎం.వెంకటేశ్వరరావు, నందిప శ్రీనివాస చక్రవర్తి, ఖండవల్లి పశువైద్యాధికారి డాక్టర్ సల్మా, సీహెచ్ రమేష్, సోమేశ్వరి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన
వ్యక్తికి ఐదేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): యువతి మృతికి కారకుడైన వ్యక్తికి న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం పదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ ఎస్సీఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే 2015లో గోకవరం గ్రామానికి చెందిన యువతి స్వాతిని పిల్లి ఆనంద్‌బాబు ప్రేమిస్తున్నానని వెంటబడి శారీరకంగా ఇబ్బంది పెట్టేవాడు దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. దీంతో ఆనంద్‌బాబుపై పలు సెక్షన్ల కింద ఎస్ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేయగా డీఎస్పీ ప్రసన్నకుమార్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టుచేశారు.ఈ కేసులో నేరం రుజువుకావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.6 వేలు చొప్పు న జరిమాన విధించారు. ఈ కేసులో ఏ2, ఏ3లపై అభియోగాలను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో స్పెషల్ ఏపీ పీలు ఐ.వెంకటరత్నం, కె.రాధాకృష్ణరాజు వాదనలు వినిపించారు.

అందరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలి

» మాతా పరావిద్యానందగిరి » దేవరపల్లిలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలు



సభలో ప్రసంగిస్తున్న మాతా పరావిద్యానందగిరి

దేవరపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అందరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని మాతా పరావిద్యానందగిరి అన్నారు. దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాలులో అఖిలాంధ్ర సాధు పరిషత్ 60వ మహాసభలు 3వ రోజున సోమవారం సుద్ధ చైతన్యానందగిరి స్వామి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా మాతా పరావిద్యానందగిరి ఉపన్యసిస్తూ హిందూమతం మన జీవనవిధానమని, ప్రతీ ఒక్కరు ప్రశాంతమైన జీవితం గడపాలని, దైవభక్తి, పెద్దల పట్ల గౌరవభావం, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలన్నారు. ధర్మానికి అనుగుణంగా, వేదాలను స్ఫూర్తిగా తీసుకుని ఆధ్యాత్మిక జీవితంలో ముందుకు సాగాలన్నారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు చేసిన బోధనలను భక్తులు అలవరచుకోవాలన్నారు. ఈ సభలో ఉపన్యాసించిన సాధువులు కమలానందభారతి స్వామి, విశ్వంభరనందగిరి స్వామి, మాతా పరబ్రహ్మానంద గిరి, సత్యనందగిరి స్వామి, శుద్ధబ్రహ్మానందగిరి స్వామి, మాత ప్రేమనంద భారతి, వీరనందబ్రహ్మచారి, మాత నిర్విశేషాదనందగిరి, సరస్వతి స్వామి ఉపన్యాసాలు భక్తులకు ఆధ్యాత్మిక చింతన కలిగించింది. ఈ సందర్భంగా భగవద్గీత అధ్యాయనం, పారాయణం, యర్నగూడెం కల్యాణ వేంకటేశ్వరస్వామి భజన మండలి, లక్ష్మీపురం విన్యావాసవి భజన సమాజ మండలి, ఆధ్వర్యంలో సంకీర్తన గానామృతం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు గద్దే మునేశ్వరరావు, సుంకవల్లి రాము, బళ్లా సూర్యచక్రం, ఆచంట సత్యనారాయణ, బలుసు సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, కరుటూరి శ్రీనివాసరావు, సాధువులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రావులపాడు జాతీయ రహదారి వంతెన సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... 30ఏళ్ల పైబడి ఉన్న పురుష మృతదేహంపై ఎరుపు రంగు షర్ట్, లేత గోధుమరంగు కాటన్ ప్యాంట్ ఉన్నాయి. చనిపోయిన వ్యక్తి లారీ క్లీనర్ గాని డ్రైవర్ అయి ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి బంధువులు గుర్తుపట్టేందుకు మార్చురీలో ఉంచినట్టు పోలీసులు చెప్పారు.

పోలవరం భూసేకరణ ప్రాజెక్టు
అడ్మినిస్ట్రేటర్‌గా అభిషేక్

రాజమహేంద్రవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పోలవరం భూసేకరణ(ఆర్అండ్ఆర్) ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ఐఏఎస్ అధికారి వి.అభిషేక్ నియమితులయ్యారు.ఆయన ఇంతవరకూ పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసరుగా పనిచేశారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.